నేటి కందం- నేటికి అందం

జాతి కుల మత వివక్షలు
ఖ్యాతిని గలిగించ వనుచు-కావరమును,దు
ర్నీతిని తొలగించుటకై
రీతిన జరుపుము వివక్ష లేని దినంబున్ !!

(మార్చి 1 వివక్షతా రహిత దినం
ళివతీనీ టతిబఇ·తీతిఎతినిజీబితినీని
టజీఎ)

-రాధశ్రీ
సెల్:9494481210

# నేటి నిజం

తెలుగు దినపత్రిక

చురక

అప్పులతో అభివృద్ధి
అదే నేటి తిప్పలు
అమలు కొరకు చూస్తున్నై
హామీలు కుప్పలు
సరిపోయే నిధులుంటెనే
సర్కారు ఇక ముందుకు
అది తెలిసి తలకిందులు
అవుతారు జనమెందుకు

-వేల్పుల నారాయణ
9440433475

website2:www.netinijam.com2 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ శనివారం 1-3-2025 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026 సంపుటి :31 సంచిక:162 పేజీలు:6 వెల: రూ.1/-


## ఉపరాష్ట్రపతి పర్యటన.. ఏర్పాట్లపై సీఎస్ సమీక్ష

హైదరాబాద్, ఫిబ్రవరి 28:తెలంగాణలో మరోసారి ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ పర్యటించనున్నారు. మార్చి 2న రాష్ట్రానికి రానున్న నేపథ్యంలోనే అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉన్నతాధికారులను ఆదేశించారు. సచివాలయంలో శుక్రవారం ఉన్నత స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఉపరాష్ట్రపతి ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ-హైదరాబాద్ (ఐఐటీ హైదరాబాద్)ను సందర్శిస్తారని, అక్కడ అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులతో సంభాషిస్తారని సీఎస్ తెలిపారు. ఈ కార్యక్రమానికి హాజరై, అదే రోజు న్యూఢిల్లీకి బయలుదేరి వెళ్తారని వెల్లడించారు.

ఇందుకు అన్ని విభాగాల మధ్య సమన్వయంతో పనిచేయాలని, కమ్యూనికేషన్ అంతరాయం లేకుండా చూసుకోవాలని ఆదేశించారు. దీని కోసం భద్రతా ఏర్పాట్లు, శాంతిభద్రతలు, ట్రాఫిక్, బందోబస్తు ఏర్పాట్లు చేయాలని తెలంగాణ పోలీసు శాఖకు సూచించారు. ఉపరాష్ట్రపతి సందర్శించే అన్ని ప్రదేశాల్లో అర్హత కలిగిన వైద్యుల సేవలను అందుబాటులో ఉంచాలని, నిరంతరాయంగా విద్యుత్ సరఫరా ఉండేలా చూసుకోవాలని రాష్ట్ర వైద్య, విద్యుత్ శాఖ అధికారులకు సీఎస్ సూచించారు.

## నేనూ సైన్స్ విద్యార్థినే.. రాజ్‌నాథ్ సింగ్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 28:నేను కూడా సైన్స్ విద్యార్థినేనని, రాజకీయాల్లోకి ప్రవేశించే ముందు కొన్నాళ్లు సైన్స్ అధ్యాపకుడిగా కూడా పనిచేశానని కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. 'జాతీయ సైన్స్‌డే' సందర్భంగా హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో జరుగుతున్న నేషనల్ సైన్స్ డే ఎగ్జిబిషన్‌కు కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్, సీఎం రేవంత్ రెడ్డి హాజరయ్యారు. ఓపెన్ టాప్ జీపులో స్టేడియంలో ఉన్న స్కూల్ అండ్ కాలేజ్ విద్యార్థులందరికీ కేంద్రమంత్రి, సీఎం అభివాదం చేశారు.

ఈ సందర్భంగా మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం, సర్ సీవీ రామన్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. డీఆర్‌డీవో, డిఫెన్స్, ఏరోస్పేస్ ఉత్పత్తులకు చెందిన 200 స్టాల్స్ ఏర్పాటు చేశారు. విజ్ఞాన్ వైభవ్ ప్రదర్శనలో రాజ్‌నాథ్ మాట్లాడుతూ తాను కూడా సైన్స్ విద్యార్థినే అని చెప్పారు.

'సర్ సీవీ రామన్ ఫిబ్రవరి 28న రామన్ ఎఫెక్ట్‌ను కనుగొన్నారు. నోబెల్ గ్రహీత రామన్ గౌరవార్థం ఫిబ్రవరి 28ని జాతీయ సైన్స్ దినోత్సవంగా మనం నిర్వహించుకుంటున్నాం. ఇంతటి విద్యార్థి సందోహాన్ని ఉద్దేశించి ప్రసంగించడం నాకు చాలా సంతోషంగా ఉంది. మానవ పరిణామాన్ని, సైన్స్ అభివృద్ధిని విద్యార్థులు అధ్యయనం చేయాలి. యువతి యువకులు శాస్త్రవేత్తలను ఆదర్శంగా తీసుకోవాలి. గ్లోబల్ లీడర్ షిప్ లో యువతదే కీలక పాత్ర. సైన్స్ టెక్నాలజీలో వచ్చే మార్పుల పట్ల విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలి. రక్షణ శాఖ చారిత్రాత్మక విజయాల్లో కేంద్రం విశేష పాత్ర పోషిస్తుంది. ఈ శాఖకు గత కొద్ది సంవత్సరాలుగా మంత్రిగా ఉండటం నా అదృష్టం. సైన్స్ అండ్ టెక్నాలజీలో కొత్త ఒరవడిని భారతదేశం సృష్టిస్తోంది. పరిశ్రమలు ఏర్పాటు చేయడం ద్వారా ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుంది. అన్ని రంగాల్లో భారత దేశం అగ్రగామిగా ఉంది. మానవుని మేధ సంపత్తు చాలా గొప్పది' అని కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు.

## దేశ రక్షణలోనూ హైదరాబాద్ ది కీలకపాత్రే - రేవంత్ రెడ్డి..

హైదరాబాద్, ఫిబ్రవరి 28:దేశాన్ని రక్షించడంలో హైదరాబాద్ అత్యంత క్రియాశీలక పాత్ర పోషిస్తోందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. గచ్చిబౌలి స్టేడియంలో నేషనల్ సైన్స్ డే ఎగ్జిబిషన్ కేంద్ర మంత్రి రాజేంద్రనాథ్ తో కలసి ఆయన ప్రారంభించారు.. డీఆర్‌డీవో, డిఫెన్స్, ఏరోస్పేస్ ఉత్పత్తులకు చెందిన 200 స్టాల్స్ ప్రదర్శించారు. డిఫెన్స్, ఏరోస్పేస్ రంగంలో భారత సామర్థ్యాలను ప్రదర్శించేలా స్టాల్స్ ఏర్పాటు చేశారు. రెండు రోజుల పాటు నేషనల్ సైన్స్ డే ఎగ్జిబిషన్ జరగనుంది.

ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడుతూ, ఈ దేశ రక్షణ బాధ్యత యువతీ యువకులపై ఉందని చెప్పారు. బీడీఎల్, డీఆర్డీఓ, మిదానీ, హెచ్ఏఎల్ వంటి దేశ రక్షణ కోసం రాకెట్లు, మిస్సైల్స్ తయారు చేస్తున్నాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఇందుకు సంబంధించి హైదరాబాద్ నగరం, హైదరాబాద్ చుట్టూ పరిశ్రమలు ఉన్నాయన్నారు. లక్షలాది మంది విద్యార్థులకు దేశభక్తి, దేశాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యతపై వారిలో స్ఫూర్తిని, అవగాహన కల్పించడానికి ఈ ప్రత్యేకమైన ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేసుకున్నామని అన్నారు.

తెలంగాణ రాష్ట్రం నుంచి ప్రతి ఏటా లక్షకుపైగా ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్లు, ముఖ్యంగా కంప్యూటర్ సైన్స్ చదివి, అమెరికాకు వెళ్తున్నారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. వారిలో దేశభక్తితో, దేశ రక్షణ ప్రాధాన్యతలను వివరించడానికి ఈ వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహిస్తున్నామని అన్నారు. తెలంగాణ నుంచి కేవలం ఐటీ ప్రొఫెషనల్స్ మాత్రమే అమెరికాకు వెళ్లకుండా, దేశ రక్షణ రంగానికి అవసరమైన సమర్థవంతమైన ఇంజినీర్లు అందించేందుకు ప్రయత్నిస్తున్నామని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు.

దేశ రక్షణ కోసం అవసరమైన ఇంజినీర్లను తయారుచేయడం మరింత ముఖ్యమని తెలిపారు.

స్వాతంత్ర్యానికి ముందు, ఆ తర్వాత కూడా హైదరాబాద్‌లో బీడీఎల్, హెచ్ఎచ్ఎల్, మిదాని, డీఆర్‌డీఓ వంటి అనేక సంస్థలు దేశ రక్షణ కోసం ఉత్పత్తి రంగంలో విశేషంగా పని చేస్తున్నాయని తెలిపారు. దేశ రక్షణ రంగానికి హైదరాబాద్, బెంగళూరు ముఖ్య కేంద్రాలుగా ఉన్నాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరించారు.

గతంలో మీతో చర్చించినట్లుగా హైదరాబాద్- బెంగళూరు డిఫెన్స్ ఇండస్ట్రియల్ కారిడార్‌గా ప్రకటించాలని, తద్వారా భారీగా పెట్టుబడులు వస్తాయని అన్నారు. రాకెట్ తయారీ సహా ఆకాశ మార్గం (స్కైరూట్) వంటి స్టార్టప్‌లు అభివృద్ధి చెందుతాయని, అందుకోసం కేంద్ర ప్రభుత్వ సహకారం, మద్దతు అవసరమని తెలిపారు. రక్షణ రంగంలో భారతదేశాన్ని నంబర్ వన్ స్థాయికి తీసుకెళ్లేందుకు తాము ప్రయత్నిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

## మార్చి 6న కేబినెట్ సమావేశం !

హైదరాబాద్, ఫిబ్రవరి 28:తెలంగాణ కేబినెట్ మార్చి 6న సమావేశం కానుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరగనున్న ఈ కేబినెట్ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించి నిర్ణయాలు తీసుకోనున్నారు.

కులగణన ప్రాతిపదికన రిజర్వేషన్లు, ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని ప్రభుత్వం భావిస్తున్న తరుణంలో ఈ సమావేశంలో కీలక నిర్ణయం తీసుకోనున్నారు. పార్లమెంట్‌లో 42 శాతం బీసీ రిజర్వేషన్ బిల్లు ఆమోదంపై మంత్రివర్గంలో చర్చించనున్నట్లు తెలుస్తోంది.

సర్వేలో పాల్గొనని వారి కోసం రాష్ట్రంలో నిర్వహించిన రెండో విడత కుల గణనకు సంబంధించిన గణాంకాలపై మంత్రివర్గం చర్చించే అవకాశం ఉంది. మార్చి 3తో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగియనుండటంతో? కొత్త రేషన్ కార్డుల పంపిణీపై మంత్రివర్గంలో చర్చించే అవకాశం ఉంది. స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు పలు అంశాలపై కేబినెట్ నిర్ణయం తీసుకోనున్నట్లు తెలుస్తోంది.

## ప్రెసిడెంట్ ఆఫ్ ఇండియా గ్రేస్ నేషనల్ ఫోరెన్సిక్ సైన్సెస్ యూనివర్శిటీ కాన్వొకేషన్ వేడుక

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 28:భారత రాష్ట్రపతి, శ్రీమతి ద్రౌపది ముర్ము, ఈరోజు (ఫిబ్రవరి 28, 2025) గాంధీనగర్‌లోని నేషనల్ ఫోరెన్సిక్ సైన్సెస్ విశ్వవిద్యాలయం స్నాతకోత్సవ వేడుకకు హాజరయ్యారు.

ఈ సందర్భంగా రాష్ట్రపతి మాటాడుతూ.. న్యాయ ఆధారిత సామాజిక వ్యవస్థ మన దేశంలో అత్యుత్తమంగా పరిగణించబడుతుం దన్నారు. వారసత్వం మరియు అభివృద్ధిని కలపడం ద్వారా, మేము న్యాయం ఆధారంగా అభివృద్ధి చెందిన భారతదేశాన్ని నిర్మిస్తున్నాము. గత కొన్ని సంవత్సరాలలో, ఫోరెన్సిక్ సైన్సెస్ పాత్రను బలోపేతం చేయడానికి మరియు ఈ రంగంలో సౌకర్యాలు మరియు సామర్థ్యాన్ని అభివృద్ధి చేయడానికి హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ అనేక ప్రభావవంతమైన చర్యలు తీసుకుంది.

ఏదైనా న్యాయ వ్యవస్థ నిజంగా అందరినీ కలుపుకొని ఉంటేనే పటిష్టంగా పరిగణించబడుతుందని రాష్ట్రపతి అన్నారు. సమాజంలోని అన్ని వర్గాలకు, ముఖ్యంగా బలహీన, బడుగు బలహీన వర్గాల వారికి ఫోరెన్సిక్ సాక్ష్యాధారాల ఆధారంగా న్యాయమైన మరియు సత్వర న్యాయం అందించడమే తమ లక్ష్యమని ఆమె విద్యార్థులకు చెప్పారు. దేశ సుపరిపాలనకు సహకరించాలని ఆమె కోరారు.

మూడు కొత్త క్రిమినల్ చట్టాల్లో నేర పరిశోధన, సాక్ష్యాలకు సంబంధించిన మార్పులు చేశామని రాష్ట్రపతి తెలిపారు.

శిక్షా కాలం ఏడేళ్లు లేదా అంతకంటే ఎక్కువ ఉన్న కేసుల్లో, నేరం జరిగిన ప్రాంతానికి ఫోరెన్సిక్ నిపుణుడు సందర్శించి దర్యాప్తు చేయడం ఇప్పుడు తప్పనిసరి అయింది. భారతీయ నాగరిక్ సురక్షా సంహిత కాలపరిమితిలో అన్ని రాష్ట్రాల్లో ఫోరెన్సిక్ సౌకర్యాలను అభివృద్ధి చేయడానికి ఏర్పాటు చేసింది. అనేక శాసనాలలో కాలపరిమితి గల ఫోరెన్సిక్ పరీక్ష తప్పనిసరి చేయబడింది. ఈ మార్పులు ఫోరెన్సిక్ నిపుణులకు డిమాండ్‌ను పెంచుతాయని రాష్ట్రపతి అన్నారు.

ముఖ్యంగా డిజిటల్ టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగాల్లో సాంకేతికతలో వేగంగా వస్తున్న మార్పుల కారణంగా ఫోరెన్సిక్ సైన్స్ నిపుణుల సామర్థ్యాలు పెరుగుతున్నాయని, అయితే అదే సమయంలో నేరస్థులు కూడా కొత్త మార్గాలను అన్వేషిస్తున్నారని రాష్ట్రపతి అన్నారు. మా పోలీసింగ్, ప్రాసిక్యూషన్ మరియు క్రిమినల్ జస్టిస్ డెలివరీ సిస్టమ్‌తో అనుబంధించబడిన వ్యక్తులు నేరాలను నియంత్రించడంలో మరియు నేరస్థుల కంటే తెలివిగా, మరింత వేగంగా మరియు అప్రమత్తంగా ఉండటం ద్వారా మాత్రమే న్యాయాన్ని అందుబాటులోకి తీసుకురావడంలో విజయవంతమవుతారు.

## ప్రగతి నగర్‌లో హైడ్రా కమిషనర్ పర్యటన..
## ప్రైవేటు వెంచర్ల నిర్వాహకులకు కీలక ఆదేశాలు!

హైదరాబాద్, ఫిబ్రవరి 28: మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రగతి నగర్‌లో హైడ్రా కమిషనర్ రంగనాథ్ పర్యటించారు. ప్రగతి నగర్‌కు సంబంధించిన స్మశాన వాటిక ఆక్రమణకు గురవుతుందన్న ఫిర్యాదుల నేపథ్యంలో శుక్రవారం నాడు రంగనాథ్ పరిశీలించారు.

స్మశాన వాటిక పక్కనే ఉన్న 304, 305, 306 ల సర్వే నెంబర్లను క్లెయిమ్ చేస్తూ ప్రైవేట్ వెంచర్ల నిర్వాహకులు పనులు చేస్తున్న నేపథ్యంలో సదరు స్థలాలను సైతం ఆయన పరిశీలించారు. ఆయా స్థలాలకు సంబంధించిన పత్రాలు ఏవైనా ఉంటే వచ్చే మంగళవారం వాటిని హైడ్రా కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. తదనంతరం అవి ప్రభుత్వ స్థలాలు అవునా.. కాదా.. అని జాయింట్ సర్వే నిర్వహించి తేలుస్తామని చెప్పారు. ఒకవేళ అది ప్రభుత్వ స్థలమని తేలితే దాన్ని స్వాధీనం చేసుకోవడంతో పాటు ప్రగతి నగర్ స్మశాన వాటిక కోసం నిజాంపేట కార్పొరేషన్ కు అప్పగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ సెక్షన్ అధికారి ప్రశాంతి, సిబ్బంది తో పాటు స్థానిక బీఆర్ఎస్ నాయకులు జశ్వంత్, ఆకుల సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణకు మరో ఎయిర్‌పోర్టు.. కేంద్రం గ్రీన్ సిగ్నల్ !

వరంగల్, ఫిబ్రవరి 28:వరంగల్ జిల్లా మామునూరు విమానాశ్రయ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ మేరకు మామునూర్ ఎయిర్ పోర్ట్ కు అనుమతిని మంజూరీ చేస్తూ కేంద్ర పౌరవిమానయాన మంత్రిత్వశాఖ కార్యదర్శి అమిత్ కుమార్ జా, ఎయిర్ పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా ఛైర్మన్ కు లేఖ ద్వారా తెలియజేసినట్లు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. మామునూర్ విమానాశ్రయాన్ని అభివృద్ధి చేసి, తిరిగి కార్యకలాపాలు ప్రారంభించేందుకు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు విమానాశ్రయ ప్రాధికార సంస్థ అభ్యర్థనకు కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది నిర్ణయం తీసుకుందని ఆయన తెలిపారు.

## సినీ ఇండస్ట్రీలో విషాదం.. దిగ్గజ నటుడు మృతి

హైదరాబాద్, ఫిబ్రవరి 28:సినీ పరిశ్రమలో విషాదం చోటు చేసుకుంది. ప్రముఖ ఒడియా నటుడు ఉత్తమ్ మొహంతి 66 ఏళ్ళ వయసులో కన్నుమూశారు. కొంతకాలంగా లివర్ సిర్రోసిస్ వ్యాధితో బాధపడుతున్న ఆయన గురుగ్రామ్ లోని మెడాంటా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఫిబ్రవరి 27 రాత్రి కన్నుమూశారు. ఇక ఉత్తమ్ మరణవార్త తెలుసుకున్న ఆయన అభిమానులతో పాటు సినీ ప్రముఖులు, రాజకీయ నాయకులు సోషల్ మీడియా వేదికగా సంతాపం వ్యక్తం చేస్తున్నారు.

1977లో అభిమాన్ చిత్రంతో ఒడియా సిని పరిశ్రమలో తన సినీ ప్రస్థానాన్ని ప్రారంభించారు ఉత్తమ్ మొహంతి. నటుడిగా రాణిస్తూ.. 1980, 90లలో అగ్ర నటుడిగా ఒక వెలుగు వెలిగారు. తన 50 ఏండ్ల సినీ కెరీర్‌లో దాదాపు 135కి పైగా సినిమాల్లో నటించారు. ఇందులో ఒడియాతో పాటు బెంగాలీ, హిందీ చిత్రాలు ఉన్నాయి.

## టన్నెల్లో సహాయ కార్యక్రమాలను స్వయంగా పర్యవేక్షిస్తున్న సింగరేణి ఎండి, ఛైర్మన్ బలరామ్

హైదరాబాద్, ఫిబ్రవరి 28: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎస్.ఎల్.బి.సి. వద్ద కీలక రెస్క్యూ ఆపరేషన్లో సింగరేణి బృందాలు ఉత్సాహంగా పాల్గొంటున్నాయి. సాహసోపేతంగా సొరంగ మార్గంలో జరుగుతున్న రెస్క్యూ చర్యలను సంస్థ ఛైర్మన్ , ఎండీ ఎన్.బలరామ్ స్వయంగా పరిశీలించారు. సంస్థ ఛైర్మన్ తమతో పాటు ఈ రెస్క్యూ ఆపరేషన్లో పాల్గొనడంతో సిబ్బంది మరింత ఉత్సాహంతో పని చేస్తున్నారు. ఎన్. డి ఆర్.ఎఫ్ కల్నల్ తో కలిసి సింగరేణి ఛైర్మన్ 14 కిలోమీటర్ల సొరంగ మార్గంలో ప్రమాద స్థలి చేరువ వరకు పరిస్థితిని సహాయక చర్యలను పరిశీలించారు. సింగరేణి రెస్క్యూ బృందాల ఆధ్వర్యంలో జరుగుతున్న గ్యాస్ కటింగ్ పనులను ఆయన దగ్గరగా ఉండి పర్యవేక్షించారు. ట్రాకు పునరుద్ధరణ జరగాలంటే దానిపై కూలిన టన్నెల్ బోరింగ్ మిషన్ (టీ.బి.ఎం) భాగాలను తొలగించాల్సి ఉంటుంది. ఈ పనిలో సింగరేణి రెస్క్యూ సిబ్బంది తమ వద్ద గల అత్యాధునిక గ్యాస్ కటింగ్ యంత్రాల ద్వారా ఇనుప పైపులను, గడ్డర్లను కత్తిరిస్తూ వేరు పరుస్తున్నారు. ప్రమాదం జరిగిన ప్రదేశానికి చేరుకోవడం కోసం ఈ ట్రాక్ పునరుద్ధరణ అత్యవసరం కనుక దీనిపై సింగరేణి రెస్క్యూ బృందాలు నిరంతరాయంగా పనిచేస్తున్నాయి. అదే సమయంలో ట్రాక్ మీద పేరుకుని ఉన్న బురద మట్టిని కూడా రెస్క్యూ బృందాలు తొలగిస్తున్నాయి.

మొత్తం 250 మంది సింగరేణి రెస్క్యూ సభ్యులు 24 గంటలు ఈ పనిలో పాల్గొనేందుకు వీరిని నాలుగు షిఫ్టులకు తగిన విధంగా విభజించడం జరిగింది.

రక్షణ సూత్రాలు పాటిస్తూ ఇచ్చిన పనిని సమర్థంగా పూర్తి చేయాలని సంస్థ చైర్మన్ రెస్క్యూ సిబ్బందికి సూచించారు. ఇదిలా ఉండగా ఎన్డీఆర్ఐ బృందాలు వారు ప్రమాద స్థలానికి చేరుకోవడానికి భూమి తొలిచే యంత్రాల (గ్రౌండ్ పెనట్రేటింగ్ ఇన్స్ట్రుమెంట్స్)ద్వారా ఐదు అనుకూలమైన ప్రాంతాలను ఎంపిక చేశారు. ఈ ప్రదేశాలలో తవ్వకాన్ని సమర్థంగా నిర్వహించడం కోసం ఎన్డిఆర్ఎఫ్, సింగరేణి బృందాలకు పనులు పురమాయించారు. దీనిలో సింగరేణి రెస్క్యూ బృందాలు అలుపెరగకుండా సమర్థంగా ముందుకు సాగుతున్నాయి. శుక్రవారం నాడు ప్రారంభమైన ఈ రెస్క్యూ ఆపరేషన్ ప్రత్యక్ష పరిశీలన, పర్యవేక్షణలో సంస్థ ఛైర్మన్ ఎన్.బలరామ్ తోపాటు జనరల్ మేనేజర్ రెస్క్యూ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. అలుపెరగకుండా, అంకితభావంతో రెస్క్యూ సేవలందిస్తున్న సిబ్బందిని ఛైర్మన్ అభినందించారు. ఇచ్చిన లక్ష్యాలు సాధించాలని ఆయన సూచించారు

## ఎస్సీ కమిషన్‌లోని ఖాళీ పోస్టులను భర్తీ చేయండి: రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 28: జాతీయ ఎస్సీ కమిషన్‌లో ఉన్న ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఇవాళ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆ పోస్టులను భర్తీ చేసి దళితుల హక్కులు, ప్రయోజనాలను కాపాడాలని ఆయన ప్రధాని మోదీని కోరారు. పోస్టులను ఖాళీగా ఉంచడమంటే.. అది బీజేపీ ప్రభుత్వ దళిత వ్యతిరేక మైండ్‌సెట్‌ను స్పష్టం చేస్తున్నదని ఆయన ఆరోపించారు. ఎస్సీ కమిషన్ అనేది ఓ రాజ్యాంగ సంస్థ అని, దాన్ని బలహీనపరచడం అంటే, రాజ్యాంగంపై దాడి చేయడమే అని, దళితుల సామాజిక హక్కుల్ని కాలరాసినట్లు అవుతుందని రాహుల్ గాంధీ తన ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. కావాలనే ఎస్సీ కమిషన్‌లో ఉన్న ఖాళీలను నింపడం లేదన్నారు. ప్రస్తుతం ఏడాది కాలం నుంచి ఎస్సీ కమిషన్‌లో రెండు కీలక పోస్టులు ఖాళీగా ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. ఎస్సీ కమిషన్‌లో వ్యక్తులు లేకుంటే, అప్పుడు ప్రభుత్వంలో ఎవరు దళితుల ఆవేదన గ్రహిస్తారని రాహుల్ ప్రశ్నించారు. వాళ్లు ఇచ్చే ఫిర్యాదులపై ఎవరు చర్యలు తీసుకుంటారని అడిగారు. ఎస్సీ కమిషన్‌లో తక్షణమే పోస్టులను భర్తీ చేయాలని, అప్పుడే ఆ సంస్థ సమర్థవంతంగా పనిచేస్తుందని తెలిపారు.

# ప్రపంచాన్ని పట్టి పీడిస్తున్న అరుదైన వ్యాధులు

("అరుదైన వ్యాధుల దినం" సందర్భంగా)

ప్రపంచ ఆరోగ్య సంస్థ వివరణ ప్రకారం మహమ్మారి తరహా వ్యాధులను అరుదైన వ్యాధులు లేదా రేర్ డిసీజెస్ అని పిలుస్తారు. ప్రతి పది వేల మందిలో దాదాపు పది వరకు అరుదైన వ్యాధులతో బాధ పడుతున్నట్లు గమనించారు. అరుదైన వ్యాధుల పట్ల ప్రజల్లో అవగాహన కల్పించడానికి ఫిబ్రవరి చివరి రోజున అనగా 28 ఫిబ్రవరి 2025న నిర్వహించడం జరుగుతున్నది. అరుగైన వ్యాధిగ్రస్తులకు భరోసా కల్పించడంతో పాటు వాటి నిర్ధారణ, చికిత్సల గూర్చి చర్చించడం జరుగుతుంది.

అరుదైన వ్యాధుల దినాన్ని వందకు పైగా దేశాలు నిర్వహిస్తూ వాటి పట్ల అవగాహనలు, పరిశోధనలు, నిర్ధారణలు, చికిత్సలు, పాలసీ నిర్ణయాలు చేయడం కొనసాగుతుంది. అధిక అరుదైన రోగాలకు సరైన చికిత్సలు లేవు. రోగ లక్షణాలను బట్టి ఉపశమన చికిత్సలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి.

## అరుదైన వ్యాధులు:

ప్రపంచవ్యాప్తంగా ఉన్న 6000 అరుదైన వ్యాధులు ఉన్నాయి. దాదాపు 300 మిలియన్ల అరుదైన వ్యాధిగ్రస్తులు ఉన్నారని, ఈ వ్యాధిల్లో 72 శాతం వరకు క్రోమోజోములకు సంబంధించినవని తెలుస్తుంది. అరుదైన వ్యాధుల జాబితాలో నాడీ, నాడీ కండర, జీర్ణక్రియ, క్రోమోజోమ్, చర్మ, ఎముకల, అస్థిపంజర, గుండె, రక్తం, ఊపిరితిత్తులు, మూత్రపిండాలు, ఇతర శరీర అవయవాలు లేదా వాటి వ్యవస్థలను ప్రభావితం చేసే రోగాలను వస్తాయి. అరుదైన వ్యాధులకు సూచనగా గులాబీ, ఆకుపచ్చ, నీలం రంగుల బ్యాడ్జిలు లేదా లైట్లు ఉపయోగిస్తారు. భారత్‌కు సంబంధించిన స్వచ్ఛంద సంస్థ అధ్యయనం ప్రకారం ఇండియాలో దాదాపు 263 అరుదైన రోగాలు ఉన్నాయని, ఏడాదికి కనీసం 5,000 మంది వీటి బారిన పడుతున్నారని తేలింది. ముఖ్యమైన అరుదైన వ్యాధుల్లో అకాంతోసైటోసిస్ కొరియా, అచలేసియా కార్డియా, ఆక్రోమెసోమెల్క్ డిస్పాజియా, అక్యూట్ ఇన్‌ఫ్లమేటరీ పాలీన్యూరోపతి, లుకేమియా, అడిసన్, ఏఎల్డీ, అలజిల్లే సిండ్రోమ్, బ్లాక్ యూరియా వ్యాధులు వస్తాయి.

## అరుదైన వ్యాధుల దినం-2025 ఇతివృత్తం:

2025 అరుదైన వ్యాధుల ఇతివృత్తంగా "మోర్ ద్యాన్ యు కెన్ ఇమాజిన్ : అన్ ఆంథాలజీ ఆఫ్ రేర్ ఎక్స్‌పీరియన్స్" అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం చేయడం జరుగుతున్నది. అరుదైన వ్యాధిగ్రస్తులకు ధైర్యాన్ని ఇవ్వడం, వారికి అవసర సహాయం చేయడం, వ్యాధుల గూర్చి పరిశోధనలు చేయడం, కుటుంబ సభ్యులకు అవగాహన కలిగించడం లాంటివి చేయవచ్చు. అరుదైన వ్యాధిగ్రస్తుల అనుభవాలను ఆన్‌లైన్ వేదికలుగా వివరించడం, వ్యాధుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలుసుకోవడలాంటివి చేయడం జరుగుతోంది.

పూర్తిగా అవగాహన లేని, అపార్థం చేసుకున్న అరుదైన వ్యాధులతో నిండు ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి.

పుట్టుకతో వచ్చే ఈ వ్యాధులకు తగు చికిత్సలు లేనందున జాగ్రత్తగా ఉండడం మాత్రమే మన చేతుల్లో, చేతల్లో ఉన్నదని గమనించాలి.

-డా॥బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# ప్రత్యేక ప్రస్తావన ధ్రువపత్రంతోపాటు రూ.50 వేల చొప్పున 4 చిత్రాలకు పురస్కారం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 28:మానవ హక్కులు అంశంపై తీసిన చిన్న చిత్రాలకు 2024 సంవత్సరానికి పదో ప్రతిష్ఠాత్మక పదో వార్షిక పోటీని భారతదేశ జాతీయ మానవ హక్కుల సంఘం (ఎన్‌హెచ్‌ఆర్‌సీ) నిర్వహించింది. దీనిలో రూ.2 లక్షల మొదటి బహుమతికి 'దూధ్ గంగా- వేలీస్ డయింగ్ లైఫ్‌లైన్'ను ఎంపిక చేశారు. ఈ డాక్యుమెంటరీని (వార్తాచిత్రం) జమ్మూ కాశ్మీర్‌కు చెందిన ఇంజినీరు శ్రీ అబ్దుల్ రశీద్ భట్ తీశారు. దూధ్ గంగ నదిలోని స్వచ్ఛ జలాల్లోకి అనేక రకాలైన వ్యర్థాలను యథేచ్ఛగా వదిలివేయడంతో నది నీరు ఎలా కలుషితమైపోతోందన్న ఆవేదనకు చిత్రరూపాన్ని కల్పిస్తూ, లోయలోని ప్రజల మేలు కోసం నదిని ప్రక్షాళన చేయాల్సిన అవసరాన్ని ప్రధానంగా చాటింది ఈ చిన్న వార్తాచిత్రం. ఆంగ్లం, హిందీ, ఉర్దూ భాషలలో రూపొందించిన ఈ చిత్రానికి సబ్ టైటిల్స్‌ను ఆంగ్లంలో కూర్చారు.

'ఫైట్ ఫర్ రైట్స్'ను రూ.1.5 లక్షల రెండో బహుమతి కోసం ఎంపిక చేశారు. ఆంధ్ర ప్రదేశ్‌కు చెందిన శ్రీ కడారప్ప రాజు ఈ చిత్రాన్ని రూపొందించారు. ఈ చిత్రం.. చిన్నతనంలోనే పెళ్లి చేయడం, విద్య అనే అంశాన్ని చర్చిస్తుంది. ఇది తెలుగు భాషలో ఉన్న ఈ చిత్రానికి ఆంగ్లంలో సబ్ టైటిల్స్‌ను సమకూర్చారు.

'గాడ్' చిత్రాన్ని లక్ష రూపాయల మూడో బహుమతి కోసం ఎంపిక చేశారు. దీనిని తమిళ నాడుకు చెందిన శ్రీ ఆర్. రవిచంద్రన్ రూపొందించారు. తాగడానికి అనువైన నీటికి ఉండే ప్రాధాన్యాన్ని గురించి ఒక వయోవృద్ధ నాయకుడు వివరించడం ఈ మూకీ చిత్రం ఇతివృత్తం.

రూ.50,000 నగదు చొప్పున నాలుగు చిత్రాలకు బహుమతులు ఇవ్వాలని కమిషన్ నిర్ణయించింది. 'ప్రత్యేక ప్రస్తావనతో ధ్రువపత్రం' కేటగిరీలో ఎంపిక చేసిన ఆ నాలుగు చిన్న చిత్రాలూ ఏవేవంటే:

'అక్షరాభ్యాసం' - దీనిని తెలంగాణకు చెందిన శ్రీ హనీశ్ ఉండ్రమాట్ల రూపొందించారు. ఈ మూకీ చిత్రం బాలల విద్య ప్రాముఖ్యాన్ని చెబుతుంది.

'విలయిల్ల పట్టధారి' - విలువ లేని గ్రాడ్యుయేట్ అని దీనికి అర్థం. దీనిని తమిళనాడుకు చెందిన శ్రీ ఆర్. సెల్వమ్ తీశారు. ఇంగ్లిషు సబ్‌టైటిల్స్ ఉన్నాయి.

ఈ చిత్రం వయోవృద్ధుల కలిగే ఆందోళనలను, వారి హక్కులను గురించి చర్చిస్తుంది.

'లైఫ్ ఆఫ్ సీత' - ఈ ఇంగ్లిషు పదాలకు సీత జీవనం అని అర్థం. దీనిని ఆంధ్ర ప్రదేశ్‌కు చెందిన శ్రీ మడక వెంకట సత్యనారాయణ రూపొందించారు. ఇది తెలుగు చిత్రం. దీనికి ఇంగ్లిషు సబ్‌టైటిల్స్ ఉన్నాయి. ఈ చిత్రంలో ధార్మిక సంప్రదాయాల కారణాన బాలలు వారి హక్కులను కోల్పోతున్న తీరు, ఈ స్థితిలో సంస్కరణను తీసుకురావాల్సిన అవసరాన్ని ప్రధానంగా చూపెట్టారు.

4. 'బి ఎ హ్యూమన్' - దీనిని ఆంధ్ర ప్రదేశ్‌కు చెందిన శ్రీ లోట్ల నవీన్ రూపొందించారు. హిందీలో ఉంది ఈ చిత్రం. దీనికి ఇంగ్లిషులో సబ్‌టైటిల్స్‌ను ఇచ్చారు.

ఎన్‌హెచ్‌ఆర్‌సీ చైర్‌పర్సన్ జస్టిస్ శ్రీ వి. రామసుబ్రమణియన్ అధ్యక్షత వహించిన పూర్తి కమిషన్ జ్యూరీలో సభ్యులుగా జస్టిస్ (డాక్టర్) బిద్యుత్ రంజన్ సారంగి, శ్రీమతి విజయ భారతి సయానీ, సెక్రటరీ జనరల్ శ్రీ భరత్ లాల్, డీజీ శ్రీ ఆర్. ప్రసాద్ మీనాలతో పాటు రిజిస్ట్రార్ శ్రీ జోగిందర్ సింగ్ సేవలందించారు.

మానవ హక్కులను పరిరక్షించడంతోపాటు మానవ హక్కులకు సంబంధించిన చైతన్యాన్ని వ్యాప్తి చేసే దిశగా పౌరులు సినిమా మాధ్యమం ద్వారా సృజనాత్మక దిశగా వారిని ప్రోత్సహించడం ఎన్‌హెచ్‌ఆర్‌సీ 2015 నుంచి ప్రవేశపెట్టిన షార్ట్ ఫిలిం పోటీల లక్ష్యం. 2024లో ఈ పోటీ పదో సంచిక కోసం పెట్టిన గడువు లోపల వచ్చిన భారతీయ భాషలకు చెందిన 303 చిన్న చిత్రాలను పరిశీలించిన తరువాత 243 ఎంట్రీలు పురస్కారాల కోసం బరిలో నిలిచాయి. పురస్కారాల ప్రదాన కార్యక్రమాన్ని త్వరలో నిర్వహించనున్నారు.

# పోటీలో పాల్గొని ప్రతిష్ఠాత్మక భారత వస్త్ర విశేషాలను ప్రపంచ వేదికపై చాటండి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 28:సుసంపన్నమైన భారత వస్త్ర విశేష వారసత్వాన్ని, ప్రపంచవ్యాప్త ఫ్యాషన్ పోకడలను మిళితం చేయడం 'ప్రపంచానికి ఖాదీ (మేక్ ది వరల్డ్ వేర్ ఖాదీ)' కార్యక్రమ లక్ష్యం. ఈ దిశగా ప్రకటన నిపుణులు, ఫ్రీలాన్సర్లకు ప్రేరణనిచ్చేలా ఉత్సాహాన్ని నింపే పోటీలకు రంగం సిద్ధమవుతోంది. ప్రారంభ ప్రపంచ దృశ్య, శ్రవ్య వినోద సదస్సు (వేవ్స్)లో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ప్రపంచానికంతటికీ ప్రీతిపాత్రమయ్యేలా ఖాదీని అంతర్జాతీయ స్థాయి బ్రాండ్ గా నిలపడం దీని లక్ష్యం. సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖతో కలిసి భారత ప్రకటన సంస్థల సంఘం (ఏఏఏఐ) నిర్వహిస్తున్న ఈ పోటీలో దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లకు చెందిన నిపుణులు, ఉత్సాహవంతులు పాల్గొని డిజిటల్, ముద్రణ, వీడియో, ప్రయోగాత్మక మార్గాల్లో తమ సృజనాత్మక భావాలకు రూపమివ్వొచ్చు. వ్యూహాత్మక ఆలోచనలు, సృజనాత్మకతకు ప్రపంచానికి ఖాదీ పోటీ ప్రాధాన్యమిస్తుంది. ఖాదీ బ్రాండ్ ఇమేజీని పెంచేలా, వినియోగదారీ భాగస్వామ్యాన్ని పెంచి ఖాదీకి ప్రపంచ వ్యాప్త ఆదరణను కలకాలం నిలిపేలా కొత్త ఆలోచనలను ఇది ప్రోత్సహిస్తుంది.

మే 1 నుంచి 4 వరకు ముంబయి లోని జియో వరల్డ్ కన్వెన్షన్ సెంటర్, జియో వరల్డ్ గార్డెన్స్ లో నిర్వహించనున్న వేవ్స్.. మీడియా, వినోద రంగాల్లో నిస్సందేహంగా ఓ ముఖ్యమైన మైలురాయిగా నిలవనుంది. అనేక కార్యక్రమాలను ఒకే వేదికపై నిలిపే ఈ విశిష్ట కార్యక్రమం ద్వారా.. భారతీయ ప్రతిభను ఈ రంగంలోని అంతర్జాతీయ ప్రముఖులతో వేవ్స్ అనుసంధానం చేయనుంది. నాలుగు ప్రాతిపదికలు వేవ్స్ కు ముఖ్యమైన ఆధారాలుగా ఉన్నాయి: సమాచార ప్రసారం- టీవీ కార్యక్రమాలు, ఏవీజీసీ-ఎక్స్‌ఆర్ (యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్, కామిక్స్, ఎక్స్టెండెడ్ రియాల్టీ), డిజిటల్ మీడియా- ఆవిష్కరణ, సినిమాలు. సమాచార ప్రసారం- టీవీ ప్రసార విభాగంలో భాగమైన మేక్ ది వరల్డ్ వేర్ ఖాదీ పోటీ.. ప్రకటన, మార్కెటింగ్ నిపుణులను ఒక్కచోటికి చేర్చి మీడియా, వినోద రంగంలో బ్రాండ్ వ్యూహాలను రూపొందించేలా ప్రోత్సహిస్తుంది. వేవ్స్ లో భాగంగా నిర్వహిస్తున్న ప్రతిష్ఠాత్మక క్రియేట్ ఇన్ ఇండియా పోటీల్లో భాగమైన ఈ చాలెంజి భాగం. క్రియేట్ ఇన్ ఇండియా పోటీల్లో ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా 73,000 మంది సృజనకారులు నమోదు చేసుకున్నారు. మరోవైపు, ఫిబ్రవరి 15 నాటికి ఖాదీ ఛాలెంజిలో 112 మంది నమోదు చేసుకున్నారు. ఖాదీని అగ్రగామిగా నిలిపి, ప్రపంచ వేదికపై భారత సృజన శక్తిని చాటడానికి రంగం సిద్ధమైంది.

# చదువుతో సంస్కారం తోడైతేనే విజయం వరిస్తుంది

- డా॥బుర్ర మధుసూదన్ రెడ్డి, విశ్రాంత ప్రిన్సిపాల్

హైదరాబాద్, ఫిబ్రవరి 28:చదువుతో పాటు సంస్కారం, విద్యతో పాటు వినయం తోడైతేనే ఎంచుకున్న లక్ష్యాలు నెరవేరుతాయని విశ్రాంత ప్రిన్సిపాల్, రచయిత, కాలమిస్ట్ అన్నారు. ఈ రోజు మెట్‌పల్లి ప్రభుత్వ మైనారిటీ పాఠశాల, జూనియర్ కళాశాల ముఖ్య అతిథిగా విద్యార్థుల నుద్దేషించి మాట్లాడుతూ సైన్స్ రంగంలో పరిశోధనలు చేసే స్థాయికి చేరుకోవడమే లక్ష్యంగా కృషి చేయాలని, శాస్త్రీయ దృక్పథంతో ముందుకు సాగాలని కోరారు. పరీక్షలు దగ్గరపడుతున్న కొద్దీ విద్యార్థుల్లో మానసిక ఆందోళన పెరిగిందని, భయం వీడితేనే సత్ఫలితాలు అందుతాయని తెలిపారు. సైన్స్, టెక్నాలజీ, ఇంగ్లీష్, మ్యాథ్స్ రంగాల్లో నిష్ణాతులైన యువతకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని సూచించారు. ప్రతి పరీక్షలో కొంత ఎక్కువ మార్కులను సాధిస్తూ తమ రికార్డును తానే బ్రేక్ చేస్తూ ఎదగాలన్నారు. ఇంటర్‌లో 900 మార్కులు, 10వ తరగతిలో 9.0 గ్రేడ్ దాటిన విద్యార్థుల తల్లిదండ్రులకు సన్మానం, విద్యార్థులకు ప్రత్యేక బహుమతులు అందిస్తామని ప్రకటించారు.

గౌరవ అతిథి లయన్ రాళ్లబండి శంకర ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ గురువుల బోధనలు నమ్మిన వారందరూ తమ తమ జీవితాల్లో అద్భుతాలను సాధించారని అన్నారు. మనిషిగా వర్తమానతావ్యక్తిని పెంపొందించుకోవాలని సలహా ఇచ్చారు. సభాధ్యక్షత వహించిన ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తమ కళాశాల విద్యార్థులు ఉన్నత ఫలితాలు సాధిస్తున్నారని సంతోషణం వ్యక్తం చేసారు. మెట్‌పల్లి లయన్స్ క్లబ్ అధ్యక్షులు శ్రీనివాస్, నాయకులు వేణుగోపాల్ కూడా పాల్గొని మాట్లాడారు. ఈ వేదిక మీద రాజరాజేశ్వర లయన్స్ క్లబ్ సౌజన్యంతో పదవ తరగతి, ఇంటర్ విద్యార్థులకు 100 మందికి పరీక్ష ప్యాడ్లు, పెన్నులు, పెన్సిల్స్, స్కేల్స్ ఉచితంగా వితరణ చేసారు.

# కమ్యూనిటీ రేడియో కంటెంట్ చాలెంజ్ స్థానిక ప్రభావానికి ప్రాధాన్యం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 28:కమ్యూనిటీ రేడియో స్టేషన్ల నుంచి సృజనాత్మక, ప్రభావశీల, నవ్య ధోరణులతో కూడిన కంటెంట్ రాబట్టడం లక్ష్యంగా ఈ కమ్యూనిటీ రేడియో కంటెంట్ చాలెంజ్ నిర్వహిస్తున్నారు. స్థానికుల గళంగా మారేలా వాటిని సాధికారం చేయడంతో పాటు ప్రాంతీయ సమస్యల పరిష్కారానికి కృషి చేసేలా వాటిని ఉత్తేజితం చేయాలన్నది ధ్యేయం. వేవ్స్ క్రియేట్ ఇండియా చాలెంజ్ తొలి సీజన్లో కమ్యూనిటీ రేడియో కేంద్రాలు చేసిన సేవలను కేంద్ర సమాచార, ప్రసారాల మంత్రిత్వ శాఖ, కమ్యూనిటీ రేడియో అసోసియేషన్ (సీఆర్ఏ) సహకారంతో నిర్వహిస్తున్న ఈ వేదిక గుర్తిస్తుంది. ఇప్పటి వరకు ఈ పోటీల్లో పాల్గొనేందుకు 246 మంది తమ పేర్లు నమోదు చేసుకున్నారు. వాటిలో 14 అంతర్జాతీయ ఎంట్రీలున్నాయి.

మీడియా, ఎంటర్టైన్మెంట్ (ఎం అండ్ ఈ) రంగం యావత్తునూ ఐక్యం చేసే హబ్ అండ్ స్పోక్ వేదిక ఈ ప్రపంచ ఆడియో, విజువల్ అండ్ ఎంటర్టైన్మెంట్ సదస్సు (వేవ్స్) తొలి ఎడిషన్. ప్రపంచ ప్రసిద్ధమైన ఈ ఈవెంట్ ప్రపంచ ఎం అండ్ ఈ రంగం దృష్టిని భారతదేశ ఎం అండ్ ఈ రంగం వైపు ఆకర్షిస్తుంది. అంతే కాదు... భారత ఎం అండ్ ఈ రంగం, అందులోని ప్రతిభతో దాన్ని అనుసంధానం చేస్తుంది.

ముంబయిలోని జియో వరల్డ్ కన్వెన్షన్ సెంటర్ అండ్ జియో వరల్డ్ గార్డెన్లో 2025 మే 1-4 తేదీల మధ్యన ఈ ఈవెంట్ జరుగుతుంది. బ్రాడ్ కాస్టింగ్ అండ్ ఇన్ఫోటైన్మెంట్, ఏవీజీసీ-ఎక్స్ఆర్, డిజిటల్ మీడియా అండ్ ఇన్నోవేషన్, చలన చిత్రాలు అనే నాలుగు మూల స్తంభాలపై ఈ సదస్సును నిర్వహిస్తున్నారు. భారతదేశ వినోద పరిశ్రమ భవిష్యత్తును ప్రదర్శించేందుకు నాయకులు, కంటెంట్ సృష్టికర్తలు, సాంకేతిక నిపుణులు అందరినీ వేవ్స్ ఒక వేదిక పైకి తెస్తుంది.

బ్రాడ్ కాస్టింగ్ అండ్ ఇన్ఫోటైన్మెంట్ విభాగం కింద నిర్వహిస్తున్న కమ్యూనిటీ రేడియో కంటెంట్ చాలెంజ్ సామాజిక వర్గాల్లో సమాచార వ్యాప్తి, అనుసంధానత, సామాజిక కార్యకలాపాల్లో వారి భాగస్వామ్యాన్ని పటిష్ఠం చేయడంలో కమ్యూనిటీ రేడియో పాత్రను అందరికీ తెలియ చేస్తుంది.

విశిష్టమైన అయిదు విభాగాల్లో ఎంట్రీలు సమర్పించాల్సిందిగా కమ్యూనిటీ రేడియో స్టేషన్లను (సీఆర్ఎస్) వేవ్స్ పోటీ ఆహ్వానిస్తోంది. ప్రతీ ఒక్క విభాగానికి సామాజికాభివృద్ధిలో ప్రత్యేక స్థానం ఉంది. విభిన్న రంగాల్లో సానుకూల మార్పు తేవడానికి కమ్యూనిటీ రేడియోలు చేసిన ప్రభావవంతమైన కృషిని ఈ విభాగాలు వెలుగులోకి తెస్తాయి.

ప్రజారోగ్యం, భద్రత : ప్రజారోగ్య సమస్యలు, అత్యవసర స్థితులు ఎదుర్కొనేందుకు సంసిద్ధత, వ్యాధుల నివారణ, పరిశుభ్రత విధానాలు, ఆరోగ్య చైతన్య కల్పన వంటి విభాగాల్లో సమస్యల పరిష్కారానికి తాము చేపట్టిన వినూత్న కార్యక్రమాలను కమ్యూనిటీ రేడియోలు ప్రదర్శిస్తాయి.

విద్య, అక్షరాస్యత : సమాజంలోని ప్రత్యేకించి గ్రామీణ ప్రాంతాల్లోని వ్యక్తుల జీవన నాణ్యత మెరుగుపరిచే దిశగా పరిజ్ఞానం, నైపుణ్యాలకు మెరుగులు దిద్ది, వారిని సాధికారం చేసేందుకు చేపట్టిన విద్య, అక్షరాస్యత కార్యక్రమాలను ప్రదర్శిస్తారు.

మహిళలు, బాలల అభివృద్ధి/సామాజిక న్యాయం, మద్దతు : సమాజంలో నిరాదరణకు గురవుతున్న వర్గాలకు మద్దతు ఇవ్వడం, సమానత్వంతో కూడిన సమాజ స్థాపించడం లక్ష్యంగా చేపట్టిన స్త్రీపురుష సమానత, బాలల హక్కులు, సాధికారత, సామాజిక న్యాయ కార్యక్రమాలను ఈ విభాగంలో ప్రదర్శిస్తారు.

వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి : గ్రామీణ సమాజంలో సామాజికఆర్థికాభివృద్ధి సాధన కోసం చేపట్టిన సుస్థిర వ్యవసాయం, వ్యవసాయ నవకల్పనలు, గ్రామీణ ఔత్సాహిక పారిశ్రామికుల ప్రోత్సాహం వంటి కార్యక్రమాలు ప్రదర్శిస్తారు.

సాంస్కృతిక పరిరక్షణ : భారతదేశానికి చెందిన సమున్నతమైన సాంస్కృతిక వారసత్వాన్ని సంరక్షించి, ప్రోత్సహించేందుకు చేపట్టిన కార్యక్రమాలు, సాంప్రదాయిక కళారీతులు, భాషలు, ఆచరణలను భవిష్యత్ తరాలకు అందించేందుకు చేపట్టిన కార్యక్రమాలు ఈ విభాగంలోకి వస్తాయి.

ఈ పోటీలో పాల్గొనేందుకు ఆసక్తి గల వారి పేర్ల నమోదు కార్యక్రమం 2025 ఫిబ్రవరి 28 వరకు ఉంటుంది. కేంద్ర సమాచార, ప్రసారాల శాఖ (ఎంఐబీ) అనుమతి పొందిన, చెల్లుబాటులో ఉన్న రెన్యువల్ లైసెన్సు కలిగిన కమ్యూనిటీ రేడియో స్టేషన్లు (సీఆర్ఎస్) అన్నింటికీ పోటీలో పాల్గొనే అవకాశం ఉంటుంది. ప్రతీ స్టేషన్... పైన పేర్కొన్న ఐదు విభాగాల్లో ఏదో ఒక విభాగంలో మాత్రమే పోటీకి దరఖాస్తు చేసేందుకు అనుమతిస్తారు. ఒకే విభాగంలో లేదా విభిన్న విభాగాల్లో బహుళ ఎంట్రీలు సమర్పించినట్టయితే అనర్హతకు దారి తీస్తుంది.

వేవ్స్ కాంపిటీషన్లో భాగంగా నిర్వహిస్తున్న కమ్యూనిటీ రేడియో కంటెంట్ చాలెంజ్ దేశంలోని కమ్యూనిటీ రేడియో స్టేషన్లు నిర్వహించిన ప్రభావవంతమైన కృషిని గుర్తించి, ప్రశంసలందించే విలువైన వేదిక. కమ్యూనిటీ రేడియో విభాగంలో నవ్యతను, సహకారాన్ని ప్రోత్సహించడం ద్వారా స్థానిక సమాజాలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం, సాధికారతలో కమ్యూనిటీ రేడియోలు నిర్వహిస్తున్న పాత్రను ఇది వెలుగులోకి తెస్తుంది.

# కూటమి ప్రభుత్వం అన్ని వర్గాలను ముంచేసింది - బొత్స

అమరావతి, ఫిబ్రవరి 28: బడ్జెట్ కేటాయింపుల్లో అన్ని వర్గాలకు తీరని అన్యాయం చేశారని వైఎస్సార్‌సీపీ నేత, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ మండిపడ్డారు. ఏపీ అసెంబ్లీ ఆవరణలో ఆయన నేడు మీడియాతో మాట్లాడుతూ..కూటమి ప్రభుత్వం ప్రజలను వంచించిందని ధ్వజమెత్తారు. కూటమి నేతలు హామీలను విస్మరించారన్నారు. అన్ని వర్గాలను కూటమి ప్రభుత్వం ముంచేసిందన్నారు.

కూటమి ప్రభుత్వం బడ్జెట్‌తో ఎవరికీ ప్రయోజనం లేదన్నారు. రైతులు, మహిళలు, యువత అన్ని వర్గాలను విస్మరించారని పేర్కొన్నారు. ధరల స్థిరీకరణ కోసం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.3వేల కోట్లు కేటాయించిందని, . కూటమి ప్రభుత్వం కేవలం రూ.300 కోట్లు మాత్రమే పెట్టింది అని బొత్స ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఆత్మ స్తుతి, పరనిందాగానే బడ్జెట్ సాగిందన్నారు. గత ప్రభుత్వాన్ని తిట్టడం.. చంద్రబాబు, లోకేష్‌ని పొగడడం తప్ప ఏమీ లేదన్నారు. ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని కూటమి ప్రభుత్వం దుర్వినియోగం చేస్తుందని ధ్వజమెత్తారు. కూటమి ఇచ్చిన వాగ్దానాల్లో అరకొరగా ఒకటి రెండు తప్ప ఏమీ చేయలేదని అంటూ ఇది షూరిటీ కాదు.. ప్రజల మోసం అనాలి అంటూ వ్యాఖ్యానించారు బొత్స.

మహిళలకు 15 వందలు, విద్యార్థులకు 15వేలు, రైతుకు 20వేలు కేటాయిస్తామని హామీ ఇచ్చారని. కేటాయింపులు మాత్రం అరకొరగా ఉన్నాయన్నారు. 81లక్షల మంది విద్యార్థులు ఉంటే 12వేల కోట్లు కావాలన్నారు కానీ కేటాయింపులు 9400 కోట్లు కేటాయించారని గుర్తు చేశారు.. మిగిలినవి ఏ విధంగా ఇస్తారు . ఎక్కడ సేకరిస్తారు చెప్పలేదని అన్నారు.

50 లక్షల మందికి గత ప్రభుత్వంలో రైతుభరోసా ఇచ్చాం అని బొత్స పేర్కొన్నారు. కానీ అన్నదాత సుఖీభవ ఇస్తే రూ.12 వేల కోట్లు కావాలని అయితే ఆ మేరకు బడ్జెట్ లో కేటాయింపులు ఏవని ప్రశ్నించారు బొత్స. మహిళలు, నిరుద్యోగుల ఊసే లేదన్నారు.. ఉచిత బస్సు పథకం పేరేత్తలేదన్నారు. రైతుల పరిస్థితి మరింత దారుణంగా ఉందన్నారు గత ప్రభుత్వంలో 3వేల కోట్లు మార్కెట్ ఇంటర్వెన్షన్ కోసం పెడితే.. ఇప్పుడు సున్నా తీసేసి 300 కోట్లు పెట్టారని ధ్వజమెత్తారు.

మిర్చి రైతుల సమస్య పై పోరాటం చేస్తే జగన్‌పై కేసు పెట్టారన్నారు. ఒక్కో కిలో, ఒక్క క్వింటా, ఒక్క బస్తా అయి నా కొన్నారా.. ఎంతసేపు పొగుడు కోవడం తప్ప రైతుల సమస్యలను పట్టించుకోవడం లేదని అన్నారు..

చంద్రబాబు, లోకేష్ ని పొగిడేందుకే సరిపోయింది. వెనుకబడిన తరగతుల అభివృద్ధి కి కేటాయింపులు లేవు. ఉత్పాదక రంగంపై కేటాయింపులు జరిగితే అభివృద్ధికి ఉపయోగపడుతుంది. ఉత్పాదకరంగంపై కేటాయింపులు లేవు. ప్రజలకు ఇచ్చిన హామీని పూర్తిగా మరిచారు. నిరుద్యోగులకు 3వేల హామీ బడ్జెట్‌లో లేదు. ఉత్పాదకరంగంపై కేటాయింపులు లేకుండా సంపద సృష్టి అంటే కేవలం మోసం చేయడమే.

ఇది పేదల వ్యతిరేక బడ్జెట్.. ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రజలను మోసం చేశారు. జగన్ కంటే ఎక్కువ ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చారన్నారు ఎమ్మెల్సీ వరుదు కల్యాణి. అధికారంలోకి వచ్చాకా ఒక్క హామీ అమలు చేయలేదని పేర్కొన్నారు. మహాశక్తికి కేటాయింపులే లేవన్నారు.

# స్కూల్ ఆటో బోల్తా.. 15 మంది విద్యార్థులకు గాయాలు

హైదరాబాద్, ఫిబ్రవరి 28:షాద్‌నగర్‌లో పెను ప్రమాదం తప్పింది. పాఠశాల విద్యార్థులతో వెళ్తున్న ఆటో బోల్తాపడింది. ఈ ప్రమాదంలో 15 మంది విద్యార్థులు గాయపడ్డారు. శుక్రవారం ఉదయం శ్రీ సత్యసాయి ప్రైవేట్ పాఠశాల విద్యార్థులు ప్రయాణిస్తున్న ఆటో షాద్‌నగర్ పట్టణంలో అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో ఆటో డ్రైవర్‌తోపాటు అందులో ఉన్న విద్యార్థులు గాయపడ్డారు. స్థానికులు వారిని ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ఓ బైకర్ రాంగ్ రూట్‌లో రావడంతో దానిని తప్పించబోయి ఆటో బోల్తా పడిందని పోలీసులు తెలిపారు. ఆటోలో నందిగామ మండలంలోని వీర్లపల్లి, చర్లఅంతిరెడ్డిగూడా, అప్పారెడ్డిగూడ గ్రామాలకు చెందిన విద్యార్థులు ఉన్నారన్నారు. షాద్ నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.







**FORM IV**

(See rule 8)

| | |
|---|---|
| 1. Place of Publication | : HYDERABAD |
| 2. Periodicity of the Publication | : DAILY |
| 3. Printer's Name | : **VEENADAS** |
| Whether Citizen of India (If foreigner, state the country of origin) | |
| Address | : **VEENA DAS** SRT-74 Jawahar Nagar Hyderabad-500 020 |
| 4. Publisher's

# పార్టీని నిర్లక్ష్యం చేస్తే అందరం మునుగుతాం - చంద్రబాబు

అమరావతి, ఫిబ్రవరి 28: హెచ్చరించారు. మళ్లీ తాము సభకు రావాలని అనే భావనతో ఎమ్మెల్యేల పని తీరు ఉండాలని తెలిపారు. ఎంపీలు, ఎమ్మెల్యేల మధ్య సమన్వయం ఉండాలని చంద్రబాబు పేర్కొన్నారు. ఎక్కడా విభేదాలకు తావు లేదని, గ్రూపులు కడితే సహించేది లేదని హెచ్చరించారు.

రాబోయే ఎన్నికల్లో అందరూ మళ్లీ గెలవాలని అన్నారు. ఆర్థిక కష్టాలు ఉన్నా జాగ్రత్తగా ముందుకు వెళ్తున్నామని చెప్పారు. నాయకుల పని తీరుపై తాను ఎప్పటికప్పుడు నివేదికలు తెప్పిస్తున్నానని చెప్పారు. తాను త్వరలో మిమ్ములను పిలిపించి ప్రత్యేకంగా మాట్లాడుతానని అన్నారు. పార్టీ నిర్మాణంపై దృష్టి పెట్టాలని సూచించారు. పార్టీని వదిలేస్తే అందరం మునుగుతామని హెచ్చరించారు. అందుకనే పార్టీ కార్యకర్తలు, ద్వితీయ శ్రేణి నాయకులపై దృష్టి పెట్టాలని చెప్పారు. మీరు వాళ్లు కలుపుకొని వెళ్తేనే ముందుకెళ్లగలుగుతామని అన్నారు. దెబ్బతిన్న రోడ్లను రెండు నెలల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. నియోజకవర్గంలో పనులు గురించి కూడా దృష్టి పెట్టాలని సీఎం చంద్రబాబు సూచించారు. దాదాపు రెండు గంటలసేపు జరిగిన ఈ సమావేశానికి టీడీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు హాజరయ్యారు.

## జాతీయ విజ్ఞనశాస్త్ర దినోత్సవం ప్రతి ఒక్కరికీ అభినందనలు తెలిపిన ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 28:ఈ రోజు జాతీయ విజ్ఞనశాస్త్ర దినోత్సవం. ఈ సందర్భంగా ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ అందరికీ అభినందనలు తెలిపారు. ఆయన ఎక్స్‌లో ఒక సందేశాన్ని పొందుపరుస్తూ, అందులో:

"జాతీయ విజ్ఞనశాస్త్ర దినోత్సవం సందర్భంగా విజ్ఞనశాస్త్రం విషయంలో మక్కువను కలిగి ఉన్న వారందరికీ, ముఖ్యంగా మన యువ ఆవిష్కర్తలకు ఇవే అభినందనలు. రండి, సైన్సుకూ, నవకల్పనలకూ మరింత మంది ఆదరణ లభించేటట్లుగాను, సైన్సును 'వికసిత్ భారత్'ను సాధించడానికి వినియోగిం చుకొనేందుకుగాను మనం కృషిచేద్దాం.

'మన్ కీ బాత్' ('మనసులో మాట') కార్యక్రమ పరంపరలో భాగంగా ఈ నెల నిర్వహించిన ఎపిసోడ్‌లో 'వన్ డే యాత్ ఎ సైంటిస్ట్'ను గురించి నేను ప్రస్తావించాను.. యువతీయువకులు వీలు చేసుకొని, ఒక రోజున విజ్ఞనశాస్త్రానికి సంబంధించిన ఏదైనా ఒక కార్యకలాపాన్ని చేపట్టాలన్నది దీని ఉద్దేశం" అని పేర్కొన్నారు.

# ప్రపంచ వేదికకు చేరుకున్న భారత గేమింగ్ విప్లవం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 28: ముగిసిన 'భారత్ టెక్ ట్రయంఫ్ ప్రోగ్రాం' (బీటీటీపీ) మూడో సీజన్ ఫైనల్స్ పోటీలో 20 మంది గేమింగ్ డెవలపర్లను విజేతలుగా ప్రకటించారు. వీరు మార్చి 17 నుంచీ 21 వరకూ శాన్ ఫ్రాన్సిస్కోలో జరిగే జీడీసీ 2025 పోటీలు, భారత్ లో ఏప్రిల్ 3,4,5 తేదీల్లో జరిగే స్టార్టప్ మహాకుంభ్, మే 1 నుంచీ 4 వరకూ జరిగే వేవ్స్ సదస్సులో దేశానికి ప్రాతినిధ్యం వహిస్తారు. ప్రపంచ పెట్టుబడిదార్లు, ప్రచురణకర్తలు, పరిశ్రమల ప్రముఖుల ముందు విలక్షణమైన గేమ్ లు, స్వదేశీ గేమింగ్ ఐపీలను ప్రదర్శిస్తారు.

భారత గేమింగ్ రంగంలో ప్రతిభ కనపర్చేవారిని ప్రోత్సహించేందుకు కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వశాఖ... వాణిజ్య, పరిశ్రమల శాఖకు చెందిన పరిశ్రమలు, అంతర్గత వాణిజ్య ప్రోత్సాహక విభాగాలూ సంయుక్తంగా బీటీటీపీని నిర్వహిస్తున్నాయి. బీటీటీపీ అనేది ఇంటరాక్టివ్ ఎంటర్టైన్మెంట్ అండ్ ఇన్నోవేషన్ కౌన్సిల్ (ఐఈఐసీ), విన్జో గేమ్స్ చేపట్టిన ప్రతిష్ఠాత్మక కార్యక్రమం.

'టెక్ ట్రయంఫ్ ప్రోగ్రాం' మూడో సీజన్: జాతీయ, అంతర్జాతీయ స్థాయి గుర్తింపు పొందేందుకు రాచబాట

ఇప్పటివరకూ జరిగిన మూడు సంచికల్లో దేశంలోని 1500 మంది అత్యుత్తమ గేమ్ డెవలపర్లు, విద్యార్థులనూ ఆకర్షించిన బీటీటీపీ-ప్రపంచ సాంకేతికత, ఐపీల కోసం 'మేడ్ ఇన్ ఇండియా' సృజన, వ్యవస్థాపకతలను పెంపొందించే గొప్ప వేదికగా మారింది. భాగస్వామ్యం, వ్యాపార విస్తృతి, ఎగుమతి అవకాశాలపరంగా ఈ విడత కార్యక్రమం ఎంతో ప్రత్యేకమైనది. యావత్ దేశాన్ని ఆకర్షించిన ఈ మూడో సంచికలో 1000కి పైగా గేమింగ్ స్టూడియోలు, ఇండీ డెవలపర్లు, ఐఐటీలు, ఐఐఎంల విద్యార్థులు, పర్సనల్ కంప్యూటర్లు, మొబైల్, కన్సోల్, ఇమ్మర్సివ్ ప్లాట్‌ఫారమ్‌లలోని టెక్ స్టార్టప్‌లు వంటి విభిన్న రంగాల వారు పాల్గొన్నారు.

సీజన్ 3లో విజయాన్ని వరించిన గేమ్‌లను డా. ముఖేష్ అఘి (భారత్-అమెరికా వ్యూహాత్మక భాగస్వామ్య వేదిక అధ్యక్షులు, సీఈఓ), పద్మశ్రీ ప్రశాంత్ ప్రకాష్ (యాక్సెల్ పార్టనర్స్ వ్యవస్థాపక భాగస్వామి), అర్చన జహాగిర్దార్ (రుకం క్యాపిటల్ సంస్థాపకులు, మేనేజింగ్ పార్టనర్), డీపీఐఐటీ సంయుక్త కార్యదర్శి శ్రీ సంజీవ్, కలారి క్యాపిటల్ మేనేజింగ్ డైరెక్టర్ రాజేష్ రాజు నహా దేశ వేటి పెట్టుబడిదారులు, వాణిజ్యవేత్తలతో కూడిన జ్యూరీ సభ్యులు ఎంపిక చేశారు.

టెక్ ట్రయంఫ్ ప్రోగ్రాం (భారత సంచిక) సీజన్ 3 విజేతల జాబితా ఇక్కడ సృజన, వృద్ధి, సాంకేతికత ఎగుమతి, ఐపీల పరంగా కీలక మలుపు వద్ద భారత గేమింగ్ రంగంఒకవైపు భారతీయ గేమింగ్ పరిశ్రమ అద్భుతమైన వృద్ధి కనపరుస్తున్న కీలక సమయంలో బీటీటీపీ ప్రభావం కూడా బలమైన ముద్ర చూపుతోంది. భారత్-అమెరికా వ్యూహాత్మక భాగస్వామ్య వేదిక (యూఎస్ఐఎస్పీఎఫ్) నివేదిక ప్రకారం, ప్రస్తుతం భారతీయ గేమింగ్ రంగం విలువ సుమారు 4 బిలియన్ డాలర్లుగా ఉండగా, 2034 నాటికి అది 60 బిలియన్ డాలర్లకు చేరవచ్చని అంచనా. ఈ అవకాశాన్ని అంది పుచ్చుకుని భారతదేశాన్ని ఇంటరాక్టివ్ ఎంటర్టైన్మెంట్, గేమింగ్ సాంకేతికత, స్వదేశీ ఐపీ సృష్టి వంటి రంగాల్లో అగ్రగామిగా నిలిపేందుకు బీటీటీపీ నరైన సమయంలో ఆవిర్భవించిందని చెప్పవచ్చు. "ప్రపంచం కోసం భారతదేశంలో తయారీ" అనే ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నినాదానికి అనుగుణంగా బీటీటీపీను రూపొందించారు. గేమింగ్, ఏవీజీసీ (యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్, కామిక్స్), డిజిటల్ స్టోరీ టెల్లింగ్‌లో అవకాశాలను చేజిక్కించుకోవాలని భారతీయ సృజనకర్తలకు ప్రధాని ఇచ్చిన పిలుపు కార్యక్రమానికి స్ఫూర్తిగా నిలుస్తోంది. ఒకవైపు ప్రధానమంత్రి ఆశయాలు, ఆకాంక్షలను నెరవేర్చే కార్యక్రమంగా, మరోవైపు భారతీయ గేమ్ డెవలపర్ల ప్రతిభను వెలికితీసే కార్యక్రమంగానే కాక, 60 బిలియన్ డాలర్ల గ్లోబల్ గేమింగ్ మార్కెట్‌గా భారత్ అవతరించగలిగే అవకాశాన్ని బీటీటీపీ వంటి ప్రత్యేక వ్యూహంతో రూపొందించిన కార్యక్రమం నెరవేర్చగలదు. బీటీటీపీను ఈ రంగంలో భాగస్వాములైనవారి సామూహిక ఆకాంక్షల సమీకరణగా చూడవచ్చు.

సమాచార, ప్రసార మంత్రిత్వశాఖ సంయుక్త కార్యదర్శి సి సెంథిల్ రాజన్ మాట్లాడుతూ, "ప్రస్తుతం సుమారు 2.6 లక్షల నిపుణుల సేవలను వినియోగించుకుంటున్న భారతదేశ ఏవీజీసీ-ఎక్స్ఆర్ రంగం గణనీయంగా విస్తరించబోతోంది, 2032 నాటికి 23 లక్షల మందికి ఉపాధి కల్పించగలదని అంచనా భారతీయ గేమింగ్ నిపుణులు ఇప్పటికే అంతర్జాతీయ స్థాయిలో అత్యంత విజయవంతమైన ప్రాజెక్టులకు సారథ్యం వహిస్తున్నారు... సృజనకు, సాంకేతిక ఆవిష్కరణలకూ భారత్ సాటిలేని గమ్యంగా అవతరించనుందని వీరి సామర్థ్యం రుజువు చేస్తోంది" అన్నారు. మంత్రిత్వశాఖ ప్రారంభించిన వేవ్స్, ఏవీజీసీ-ఎక్స్ఆర్ నేషనల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ వంటి వ్యూహాత్మక కార్యక్రమాలు దేశాన్ని ఏవీసీజీ ప్రధాన కేంద్రంగా తీర్చిదిద్దడంలో సహాయ పడతాయని చెప్పారు. భారతదేశ ఏవీజీసీ రంగం భవిష్యత్తును తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషిస్తున్న సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ, ఈ రంగం ఆర్థిక వృద్ధి, ఉద్యోగ కల్పనకు చోదకశక్తిగా పనిచేసే సామర్థ్యాన్ని కలిగి ఉన్నట్లు గుర్తించిందని చెప్పారు. 'క్రియేట్ ఇన్ ఇండియా ఛాలెంజ్', 'టెక్ ట్రయంఫ్ ప్రోగ్రామ్' వంటి కార్యక్రమాల ద్వారా వేవ్స్ పరిశ్రమ రంగం, విద్యాసంస్థల మధ్య సహకారం, కంటెంట్ సృష్టికి ప్రోత్సాహం కల్పిస్తుందనీ, అంతర్జాతీయ భాగస్వామ్యాలను సులభతరం చేస్తుందనీ అన్నారు.

మీడియా, వినోద రంగాల్లో మైలురాయిగా నిలువనున్న 'ప్రపంచ ఆడియో విజువల్ ఎంటర్టైన్మెంట్ సమిట్'-వేవ్స్ తొలి కార్యక్రమాన్ని భారత ప్రభుత్వం మహారాష్ట్ర ముంబయిలో మే 1 నుంచి 4 వరకూ నిర్వహిస్తుంది.

మీరు పరిశ్రమల్లో పని చేసేవారైనా, పెట్టుబడిదారులు, సృజనకారులు లేదా ఆవిష్కర్తలైనా, ఇతరులతో అనుసంధానమయ్యేందుకు, మీ సృజనకు పదును పెట్టుకునేందుకు, మీడియా, ఎంటర్టైన్మెంట్ రంగాల్లో భాగస్వామ్యానికి వేవ్స్ సమిట్ అనువైన వేదికను కల్పిస్తుంది.

కంటెంట్ సృష్టి, మేధో సంపత్తి, సాంకేతిక ఆవిష్కరణలకు కేంద్రంగా, సృజనలో అగ్రగామిగా, భారత్ స్థానాన్ని వేవ్స్ ఎన్నో రెట్లు పటిష్ఠపరచనుంది. సమిట్ లో ప్రసార రంగం, ప్రింట్ మీడియా, టెలివిజన్, రేడియో, సినిమా, యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్, కామిక్స్, ఆడియో, సంగీతం, అడ్వర్టైజింగ్, డిజిటల్ మీడియా, సోషల్ మీడియా వేదికలు, జనరేటివ్ ఏఐ, ఆగ్మెంటెడ్ రియాలిటీ, వర్చువల్ రియాలిటీ, ఎక్స్‌టెన్డెడ్ రియాలిటీ రంగాలపై ప్రధానంగా దృష్టి సారించనున్నారు.

# ఎయిమ్స్ ను సందర్శించిన కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని

అమరావతి, ఫిబ్రవరి 28:గుంటూరు జిల్లాలోని మంగళగిరి ఎయిమ్స్ హాస్పిటల్ ను కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ శుక్రవారం సందర్శించారు. ఇన్ పేషెంట్ ఔట్ పేషెంట్ వార్డులను పరిశీలించి పేషెంట్లతో ఆయన స్వయంగా సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. వైద్యాధికారులతో కలిసి సౌకర్యాలు సమస్యలు తదితర వివరాలపై ఆరా తీశారు. అభివృద్ధి చేయాల్సిన పనులు, సౌకర్యాలు తదితర అంశాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పెమ్మసాని మాట్లాడుతూ.. విభజిత ఆంధ్ర ప్రదేశ్ తర్వాత ఎయిమ్స్ వంటి కేంద్ర ప్రభుత్వ వైద్యశాలను 150 ఎకరాల్లో మంగళగిరిలో చంద్రబాబు నాయుడు ఏర్పాటు చేయించారు. ఎయిమ్స్ కు కావలసిన విద్యుత్ సరఫరా, మంచినీటి సరఫరా గడిచిన ఐదేళ్లలో వైసిపి ప్రభుత్వం అందించలేక పోయింది. 10 ఎకరాల అదనపు స్థలంతో పాటు పవర్, వాటర్ సప్లై టీడిపి అందించడం జరిగింది.

95% కు పైగా పేషెంట్లు ఇక్కడి సేవలు, సౌకర్యాలతో సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. స్టేట్ గవర్నమెంట్ తో పాటు సెంట్రల్ గవర్నమెంట్ తో కో-ఆర్డినేషన్ సాధ్యపరిచేందుకు ఇక్కడ వివరాలు తెలుసుకుంటున్నాము. 960 బెడ్స్ కావలసి ఉండగా కేవలం 600 మాత్రమే అందుబాటులో ఉన్నాయి. అలాగే ఐసియులో 96 కావలసి ఉండగా 20 మాత్రమే పడకలు అందుబాటులో ఉన్నాయి. 2 లక్షల 73 వేలకు పైగా పేషెంట్లు ఇక్కడ సేవలు పొందుతున్నారు. మరింత ఎక్కువ మంది పేషెంట్లకు సేవలు అందించేలా చర్యలు తీసుకుంటున్నాం. ఫార్మసీ మెడికల్ స్టోర్స్ షార్టేజ్, తక్కువ బస్సులు, బస్సు షెల్టర్లు లేక పేషెంట్లు ఇబ్బందులు పడుతున్నారు. నారా లోకేష్ ఆధ్వర్యంలో ఒక రెండు బస్సులను అందించబోతున్నారు. ఎలక్షన్ కోడ్ ముగియగానే ఆ రెండు బస్సులు అందుబాటులోకి వస్తున్నాయి. ఈ బస్సులు అందజేసిన నారా లోకేష్కి ధన్యవాదాలు. ఇన్ పేషెంట్లు కొన్ని రోజులు హాస్పిటల్లో ఉండాల్సిన అవసరం ఉంటుంది.

అలాంటి వారికి ధర్మశాలను మరింత అభివృద్ధి చేసి అందుబాటులోకి తీసుకొచ్చే చర్యలు చేపట్టబోతున్నాం. అంబులెన్స్ సర్వీస్ బయట నుంచి వచ్చిన వారికి అధికంగా ఛార్జ్ చేయడంపై చర్యలు తీసుకోబోతున్నాం. చార్జీలు కంటే ఎక్కువ వసూలు చేయకూడదని సూచీ బోర్డులు ఏర్పాటు చేయబోతున్నాం.

## ఒక్క రోజులో రూ.10 లక్షల కోట్ల సంపద ఆవిరి..

ముంబయి, ఫిబ్రవరి 28: దేశీయ స్టాక్ మార్కెట్లు శుక్రవారం భారీ నష్టాలను చవిచూశాయి. ఒక్క రోజులోనే మదుపర్లు సంపద రూ.10 లక్షల కోట్ల మేర ఆవిరైంది. అంతర్జాతీయంగా ప్రతికూల సంకేతాలు, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పలు దేశాలపై విధిస్తున్న టారిఫ్‌లు, విదేశీ పెట్టుబడుల ఉపసంహరణ మదుపర్లలో నెగిటివ్ సెంటిమెంట్‌కు కారణమవుతున్నాయి. దీంతో శుక్రవారం ఉదయం భారీ నష్టాలతో ప్రారంభమైన సూచీలు ఆ తర్వాత మరింత కిందకు దిగజారాయి. సెన్సెక్స్ 73, 500 దిగువకు, నిఫ్టీ 22, 200 కిందకు పడిపోయాయి.

గురువారం ముగింపు (74, 612)తో పోల్చుకుంటే శుక్రవారం ఉదయం 400 పాయింట్ల నష్టంతో రోజును ప్రారంభించిన సెన్సెక్స్ ఆ తర్వాత మరింతగా నష్టాల్లోకి కూరుకుపోయింది. ఏ దశలోనూ లాభాల్లోకి రాలేదు. మధ్యాహ్నం తర్వాత నష్టాలు మరింత తీవ్రమ య్యాయి. చివరి గంటలో అమ్మకాలు వెల్లువెత్తాయి. చివరకు సెన్సెక్స్ 1414 పాయింట్ల భారీ నష్టంతో 73, 198 వద్ద రోజును ముగించింది. మరో వైపు నిఫ్టీ కూడా సెన్సెక్స్ బాటలోనే కదలాడింది.

# ముగిసిన శివరాత్రి ఉత్సవాలు.. వైభవంగా పూర్ణాహుతి..

**-పాల్గొన్న కమిషనర్ రామచంద్ర మోహన్**

**-రేపటి నుండి ద్వాదశ ప్రదక్షిణలు పవళింపు సేవలు..**

అమరావతి, ఫిబ్రవరి 28: విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై ఉన్న శ్రీ దుర్గా మల్లేశ్వరి స్వామి వార్ల దేవస్థానంలో జరుగుతున్న శివరాత్రి మహోత్సవాలు అత్యంత వైభవంగా ముగిసాయి. ఈనెల 24వ తేదీ నుండి ప్రారంభమైన ఈ ఉత్సవాల్లో భాగంగా శ్రీ మల్లేశ్వర స్వామివార్లకు ప్రతిరోజు అత్యంత వైభవంగా పూజా కార్యక్రమాలు, రుద్రాభిషేకాలు వంటివి నిర్వహించారు. మహా శివరాత్రి ముగింపు ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామి వారి ఆలయంలో మండపారాధన, కలసారాధన, మూలమంత్ర హవనములు, హారతి మంత్రపుష్పాలు తీర్థప్రసాద వినియోగం వంటి కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు.

అనంతరం యాగశాలలో మహా శివరాత్రి ఉత్సవ పూర్ణాహుతి ధాన్యకోట్యోత్సవం వసంతోత్సవంను నిర్వహించారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్, ఆలయ కార్యనిర్వహణాధికారి కె.రామచంద్ర మోహన్, స్థానాచార్య వి.శివ ప్రసాద్ శర్మ, వైదిక కమిటీ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం శివాలయం నుండి దేవతామూర్తులతో దుర్గా ఘాట్ చేరి, పవిత్ర కృష్ణానదిలో అవభృతోత్సవ కార్యక్రమం నిర్వహించారు.

ఇంద్రకీలాద్రిపై ఉన్న శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వారి దేవస్థానంలో రేపటి నుండి ద్వాదశ సేవా కార్యక్రమాలు ప్రారంభం కానున్నాయి. ఇందులో భాగంగా మార్చి 1వ తేదీ నుండి 3వ తేదీ వరకు రాత్రి 7గంటలకు ద్వాదశ ప్రదక్షిణలు, పవళింపు సేవలను నిర్వహించనున్నారు.

# మామునూరు విమానాశ్రయం నిర్మాణానికి కేంద్రం రూట్ క్లియర్

హైదరాబాద్, ఫిబ్రవరి 28:వరంగల్ జిల్లా మామునూరులో కొత్త విమానాశ్రయం నిర్మాణానికి కీలక ముందడుగు పడింది. ఎయిర్‌పోర్ట్ అభివృద్ధిపై గత కొంతకాలంగా కొనసాగుతున్న కసరత్తులకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మామునూరును విమానాశ్రయంగా అభివృద్ధి చేయాలని గతంలోనే ప్రతిపాదనలు పంపగా, తాజాగా కేంద్రం దీనికి అంగీకారం తెలిపింది. రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తి మేరకు మామూనూరు ఎయిర్ పోర్ట్ ఆపరేషన్స్ని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు ఉత్తర్వులు ఇచ్చారు. శంషాబాద్ విమానాశ్రయం నుంచి 150 కి.మీ పరిధిలో మరో విమానాశ్రయం ఉండకూడదని గతంలో జీఎంఆర్ సంస్థతో ఒప్పందం ఉంది. రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు.. జీఎంఆర్ ప్రత్యేకంగా చర్చలు జరిపారు. దీంతో మామునూరుకు జీఎంఆర్ అంగీకారం తెలిపింది. జీఎంఆర్ అంగీకారం తెలపడంతో విమానాశ్రయం పనులు చేపట్టేందుకు పౌరవిమానయాన శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. త్వరితగతిన నిర్మాణ పనులు చేపట్టాలని ఎయిర్ పోర్ట్ అథారిటీని రామ్మోహన్ నాయుడు ఆదేశించారు.

ఎయిర్పోర్టు విస్తరణకు అవసరమైన 256 ఎకరాల భూ సేకరణకు రూ.205 కోట్లు విడుదల చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం గతంలోనే జీవో విడుదల చేసింది. ఎయిర్పోర్టు నిర్మాణానికి సంబంధించి డిజైన్లతో కూడిన డీపీఆర్ను సిద్ధం చేయాలని ఎయిర్పోర్టు అథారిటీకి రోడ్లు, భవనాల శాఖ లేఖ రాసింది. . ఇప్పటికే ఎయిర్పోర్టు పరిధిలో 696 ఎకరాల భూమి ఉంది. ఆ భూమికి అదనంగా మరో 253 ఎకరాల భూమిలో కొంత రన్వే విస్తరణ, టెర్మినల్ బిల్డింగ్, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ (ఏటీసీ), నేవిగేషన్ ఇన్స్ట్రుమెంట్ ఇన్సులేషన్ నిర్మాణాలు చేపట్టనున్నట్లు రోడ్లు, భవనాల శాఖ వెల్లడించింది. నిజాం కాలంలో మామునూరు నుంచి వాయుదూత్ విమానాలు నడిచేవి. భారత్, చైనా యుద్ధ సమయంలో కీలక సేవలందించాయి. దాదాపు 32 ఏళ్ల కిందట మూతపడిన మామునూరు విమానాశ్రయానికి మళ్లీ 'రెక్కలు' రానున్నాయి.

ఈ నిర్ణయంతో వరంగల్ ప్రాంతానికి ప్రయాణ సౌకర్యాలు మరింత పెరగనున్నాయి. విమాన ప్రయాణాల విస్తరణ, వ్యాపారం, పర్యాటకం అభివృద్ధికి మామునూరు ఎయిర్‌పోర్ట్ కీలకంగా మారనుంది. ఈ విమానాశ్రయం నిర్మాణం పూర్తయితే తెలంగాణలో మరొక ప్రధాన ఎయిర్‌పోర్ట్ ఏర్పడి, ప్రజలకు మెరుగైన ప్రయాణ సదుపాయాలు అందుబాటులోకి రానున్నాయి. కాగా, ఈ విమానాశ్రయ నిర్మాణానికి పూర్తి స్థాయిలో అనుమతులు రావడం పట్ల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

# డాగ్ స్క్వాడ్ పాసింగ్ పరేడ్ ..డిజికి బోకే ఇచ్చిన జాగిలం

హైదరాబాద్, ఫిబ్రవరి 28: రంగారెడ్డి జిల్లా మొయినాబాద్‌లోని ఇంటిగ్రేటెడ్ ఇంటెలిజెన్స్ ట్రైనింగ్ అకాడమీ (ఐఐటీఏ)లో నేడు 24వ బ్యాచ్ కెనైన్స్ (డాగ్ స్క్వాడ్) పాసింగ్ అవుట్ పరేడ్ నిర్వహించారు. ఈ పరేడ్‌కు ముఖ్యఅతిథిగా ఇంటలిజెన్స్ డీజీ శివధర్ రెడ్డి, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు. డీజీకి ఓ జాగిలం పూలబొకే ఇచ్చి స్వాగతం పలికి సెల్యూట్ చేసింది. అనంతరం డీజీ జాగిలాలను పరిశీలించి.. గౌరవ వందనం స్వీకరించారు.

ఐఐటీఏలో 24వ బ్యాచ్ కెనైన్స్ పాసింగ్ అవుట్ పరేడ్‌లో 72 జాగిలాలు పాల్గొన్నాయి. ఈ 72 జాగిలాలకు 101 మంది హ్యాండ్లర్స్ శిక్షణ ఇచ్చారు. ఐఐటీఏలో లెబ్రడాల్, జర్మన్ షపర్డ్, ఆల్సీషియన్, గోల్డెన్ రిట్రీవర్, డాబర్‌మెన్, డాల్మేషన్ జాతులకు చెందిన జాగిలాలకు శిక్షణ ఇచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా 256 జాగిలాలు పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో సేవలు అందిస్తున్నాయి. ఇందులో సుమారు 120 జాగిలాలు డ్రగ్స్, గంజాయి, ఇతర మాదకద్రవ్యాలను గుర్తించేందుకు శిక్షణ తీసుకున్నాయి.

# పయ్యావులకు నారా లోకేష్ ప్రశంసలు ...

**-విద్యా శాఖకు అధిక నిధుల కేటాయించడం పట్ల హర్షం**

**-ఏపీలో పాఠశాల విద్యను దేశంలోనే నెం.1గా తీర్చి దిద్దుతాం**

**-అన్ని ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత విద్యుత్**

**-విప్లవాత్మకమైన నిర్ణయమని ప్రశంస**

**-ఇచ్చిన మాట ప్రకారం 'తల్లికి వందనం' పథకానికి నిధులు**



అమరావతి, ఫిబ్రవరి 28: 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను రూ. 3.22 లక్షల కోట్లతో ఆంధ్రప్రదేశ్ బడ్జెట్ ను ప్రభుత్వం ప్రవేశపెట్టిన వి బడ్జెట్‌పై తాజాగా రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ హర్షం వ్యక్తం చేశారు. అన్ని వర్గాల వారికి వెన్నుదన్నుగా బడ్జెట్ రూపొందిందని అన్నారు. ఏపీలో పాఠశాల విద్యను దేశంలోనే నెం.1గా తీర్చిదిద్దేందుకు సీఎం చంద్రబాబు నేతృత్వంలోని ప్రజాప్రభుత్వం ప్రణాళికబద్ధంగా ముందుకు సాగుతోందని ప్రశంసించారు.

ఇందులో భాగంగా రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత విద్యుత్ అందించాలని నిర్ణయించడం విప్లవాత్మకమైన నిర్ణయమని కొనియాడారు. ఇది స్థానిక సంస్థలపై ఆర్థిక భారాన్ని తగ్గించడమేగాక ఉపాధ్యాయులు, విద్యార్థులపై ఒత్తిడిని తగ్గిస్తుందన్నారు. సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా ఇచ్చిన మాట ప్రకారం 'తల్లికి వందనం' పథకాన్ని 2025-26 ఆర్థిక సంవత్సరం నుంచి ప్రారంభించడానికి బడ్జెట్ లో నిధులు (రూ.9,407 కోట్లు) కేటాయించినట్లు తెలిపారు.

రాష్ట్రంలో 1 నుంచి 12వ తరగతివరకు చదువుకునే ప్రతి విద్యార్థికి ఈ పథకాన్ని వర్తింపజేస్తామన్నారు. ఈసారి బడ్జెట్ లో పాఠశాల విద్యకు రూ. 31,805 కోట్లు, ఉన్నత విద్యకు రూ. 2,506 కోట్లు వెరసి రూ. 34,311 కోట్లు (గత ఏడాది కంటే రూ. 2,076 కోట్లు అధికం) కేటాయించడం ప్రభుత్వ విద్యావ్యవస్థను బలోపేతం చేయడంలో తమ చిత్తశుద్ధికి అద్దం పడుతోందన్నారు.

రానున్న ఐదేళ్లలో ఏపీ మోడల్ విద్యావ్యవస్థను తీసుకురావాలన్న తన సంకల్పానికి బడ్జెట్ లో తాజాగా కేటాయించిన నిధులు దన్నుగా నిలుస్తాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో నవీన ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు అమరావతిలో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటు చేయాలని నిర్ణయించడం హర్షణీయమన్నారు. దీంతో ఏపీ యువత అంతర్జాతీయ స్థాయి అవకాశాలను అందిపుచ్చుకునేందుకు ఆస్కారం ఏర్పడుతుందని మంత్రి లోకేష్ పేర్కొన్నారు.

కిన్నెర ఆర్ట్ థియేటర్స్

ప్రముఖ గజల్ కవి శ్రీ కారుప్రోలు మాధవరావు విరచిత "సుందరి" మాధవ గజల్ మాలిక కావ్యం, "సుందరి" ఆడియోఆల్బమ్ ల..

అవిష్కరణోత్సవం

తేది: 08-03-2025 శనివారం
(ఉ.గం.10.00 నుండి గం. 13.00 వరకు)

వేదిక:
తెలంగాణ సారస్వత పరిషత్ హాల్, హైదరాబాద్
(కోఠినుండి బొగ్గులకుంట ఆబిడ్స్‌కు వెళ్ళేదారిలో)

సభాధ్యక్షులు: శ్రీ నేరెళ్ళ మాల్యాద్రి
అడ్వకేట్ సుప్రీంకోర్టు ఆఫ్ ఇండియా, న్యూఢిల్లీ.

ముఖ్య అతిథి ఆవిష్కర: శ్రీ వై.యస్.ఆర్.శర్మ
సంపాదకులు ఆంధ్రప్రభ దినపత్రిక

విశిష్ట అతిథి: శ్రీ అయాచితం శ్రీధర్
తెలంగాణ రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ పూర్వ అధ్యక్షులు.

-:గౌరవ అతిథులు:-

డాక్టర్ విజయలక్ష్మీ పండిట్
ప్రముఖ కవయిత్రి, విశ్వపుత్రిక గజల్ ఫౌండేషన్ ఛైర్మన్.

శ్రీ అబ్దుల్ రజా హుస్సేన్
ప్రముఖ జర్నలిస్టు రచయిత.

శ్రీ సామల రాజవర్ధన్
కవి పండితులు.

శ్రీ ముకుంద సుబ్రహ్మణ్యశర్మ
ప్రముఖ గజల్ కవి

శ్రీ ఇరువింటి వెంకటేశ్వర శర్మ
ప్రముఖ కవి, గజల్ సాహిత్య వేదిక అధ్యక్షులు.

శ్రీ తంగిరాల చక్రవర్తి
సుప్రసిద్ధ జర్నలిస్ట్,కవి, రచయిత.

కీ.శే. శ్రీమతి ఆండాళ్ళు గారికి..
"ఆరాధ్య" గజల్ గాన నీరాజనం
గాయకులు: శ్రీ రసవిహారి
ఔత్సాహిక గాయనీగాయకులచే గజల్ గానం

# పౌర విమానయాన శాఖ మంత్రి శ్రీ రామ్మోహన్ నాయుడు చేతుల మీదుగా చెన్నై విమానాశ్రయంలో ఉడాన్ యాత్రి కెఫే ప్రారంభం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 28:చెన్నై విమానాశ్రయంలో ఉడాన్ యాత్రి కెఫేను కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి శ్రీ రామ్మోహన్ నాయుడు ఈ రోజు ప్రారంభించారు దేశంలో మొదటి ఉడాన్ యాత్రి కెఫేను కోల్‌కతాలోని నేతాజీ సుభాస్ చంద్ర బోస్ అంతర్జాతీయ విమానాశ్రయం 100వ వార్షికోత్సవ సందర్భంలో- కిందటి ఏడాది డిసెంబరు 19న- ప్రారంభించారు. అది మొదలు కోల్‌కతా విమానాశ్రయంలోని ఈ కెఫేకు ప్రయాణికుల్లో మంచి ఆదరణ లభించింది. ఆ కెఫేలో అందిస్తున్న ఆహార, పానీయాల నాణ్యత, చౌకగా వాటిని అందించడంతో వారు చాలా సంతోషంగా ఉంటున్నారు. ప్రయాణికులు కోరిన మేరకు ఈ కార్యక్రమాన్ని ఇప్పుడిక దేశమంతటా విస్తరిస్తున్నారు.

చెన్నై విమానాశ్రయంలో, దేశీయ టర్మినల్-1లో చెక్-ఇన్ కన్నా ముందు ప్రాంతంలో తెరిచిన ఉడాన్ యాత్రి కెఫే ప్రయాణికులకు ఈ కింది ధరలకు స్వచ్ఛమైన ఆహార పానీయాలను అందించనుంది:

శ్రీ రామ్మోహన్ నాయుడు ప్రసార మాధ్యమాల ప్రతినిధులను ఉద్దేశించి మాట్లాడుతూ, "విమాన ప్రయాణాన్ని అందరికీ మరింత అధిక సౌకర్యవంతంగానూ, సులభమైందిగానూ, తక్కువ ఖర్చుతో కూడుకొన్నదిగానూ తీర్చిదిద్దాలనే ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ దృష్టికోణానికి సరిపోలే ఒక ఉదాహరణగా ఉడాన్ యాత్రి కెఫే ను రూపొందించారు. కోల్‌కతా విమానాశ్రయంలో ఇలాంటి చిన్న రెస్టారెంటును తెరిచిన తరువాత ప్రయాణికులు ఇతర విమానాశ్రయాల్లో కూడా అదే తరహా సౌకర్యాన్ని మొదలుపెట్టాలని కోరారు. దేశ తూర్పు ప్రవేశద్వారం కోల్‌కతాకు తరువాయిగా, దేశ దక్షిణ ప్రవేశద్వారమైన చెన్నై విమానాశ్రయంలో ఉడాన్ యాత్రి కెఫేను ఏర్పాటు చేసినందుకు సంతోషంగా ఉంది. చెన్నై విమానాశ్రయం దేశంలో అన్నిటికన్నా పాతదే కాక, ప్రస్తుతం దేశంలో అయిదో అతి పెద్ద విమానాశ్రయంగా ఉంది. ఇక్కడి నుంచి ఏడాదిలో 2 కోట్ల 20 లక్షల మంది కన్నా పైచిలుకు ప్రయాణికులు రాకపోకలు సాగిస్తూ ఉన్నారు. ఇక్కడ ప్రయాణికుల సౌకర్యాలను పెంచాలనే నిబద్ధత మాకుంది. డిజి యాత్ర, విశ్వసనీయ ప్రయాణికుల కార్యక్రమం ఈ-గేట్స్ వంటి వాటి దన్నుతో సహజమైన, ఎండ్-టు-ఎండ్ డిజిటల్ ప్రయాణానుభూతిని అందిస్తున్నాం" అన్నారు.

అంతర్జాతీయ కార్యకలాపాలను పెంచడం కోసం రెండో టర్మినల్‌ను 86,135 చదరపు మీటర్ల మేర విస్తరించే పనులు జరుగుతూ ఉన్నాయని మంత్రి వెల్లడించారు. దీనికి అదనంగా, రూ.75 కోట్ల కన్నా ఎక్కువ పెట్టుబడితో ఒకటో టర్మినల్, నాలుగో టర్మినల్‌లలో నవీకరణ పనులు సాగుతున్నాయి. విమానాశ్రయం నుంచి నగరం వైపు రద్దీని తగ్గించే దృష్టితో రూ.19 కోట్ల వ్యయంతో వాహనాల రాకపోకలు సాఫీగా సాగిపోయే ప్రణాళికను కూడా అమలుచేస్తున్నారు.

మౌలిక సదుపాయాలకు మించి, ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించడానికి చెన్నై అంతర్జాతీయ విమానాశ్రయం అంకితభావంతో పనిచేస్తోంది. దీనిలో భాగంగా వయోవృద్ధులకు, గర్భవతులకు ఉచిత బగ్గీ సేవలు, బాలలకు సంరక్షణ వసతి, చికిత్స సదుపాయాలు, ఆధునిక విశ్రాంతి మందిరాలు.. ఇవన్నీ హాయైన యాత్రానుభూతిని అందించడానికి ఉద్దేశించినవే. ప్రసార మాధ్యమాల ప్రతినిధులతో మంత్రి మాట్లాడుతూ, చెన్నై విమానాశ్రయం పూర్తిగా హరిత ఇంధనంతో నడుస్తోందని, పర్యావరణ నిబద్ధతలో భాగంగా 1.5 మెగావాట్ సామర్థ్యం కలిగిన విద్యుత్తు ప్లాంటు కూడా ఇక్కడ ఉందని వివరించారు.

ఈ రోజు ప్రారంభించిన ఉడాన్ యాత్రి కెఫే, 'ఉడాన్' (ఉడే దేశ్ కా ఆమ్ నాగరిక్) పథకం స్ఫూర్తికి అనుగుణంగా ఉంది. విమానాలలో ప్రయాణించే అవకాశాన్ని చాలా మందికి కల్పించడంతోపాటు విమానాశ్రయ సంబంధిత మౌలిక సదుపాయాలను ఆధునికీకరించడం కూడా ఈ పథకం ఉద్దేశం. ఈ కార్యక్రమంలో తమిళ నాడు పరిశ్రమల శాఖ మంత్రి డాక్టర్ టి.ఆర్.బి. రాజా, పౌర విమానయాన శాఖ, ఏఏఐ, చెన్నై విమానాశ్రయంల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ప్రయాణికులకు మెరుగైన అనుభూతులను అందించడంతోపాటు సంధానాన్ని పెంచాలని పౌర విమానయాన మంత్రిత్వ శాఖ చేస్తున్న ప్రయాణంలో మరో ముఖ్య ఘట్టంగా నిలుస్తుంది.

## వేసవిలో తిరుమలకు వచ్చే భక్తులకు టీటీడీ గుడ్‌న్యూస్

తిరుపతి, ఫిబ్రవరి 28:వేసవిలో తిరుమలను దర్శించుకునే భక్తులకు టీటీడీ గుడ్‌న్యూస్ తెలిపింది. ముఖ్యంగా విద్యాసం స్థలకు సెలవుల కారణంగా తిరుమలలో భక్తుల రద్దీ పెరిగే అవకాశముందని ముందు జాగ్రర్తగా పలు ఏర్పాట్లు చేస్తున్నామని టీటీడీ అదనపు ఈవో సి. హెచ్.వెంకయ్య చౌదరి వెల్లడించారు.

ఈమేరకు తిరుమలలోని అన్నమయ్య భవనంలో వేసవి సెలవుల యాత్రికుల రద్దీకి సంబంధించి చేయాల్సిన ఏర్పాట్లపై వివిధ శాఖల ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. మొదటి ఘాట్ రోడ్డులోని అక్కగార్ల గుడి, శ్రీవారి సేవా సదన్, తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉండే ప్రాంతాల్లో చలువ పెయింట్ వేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.యాత్రికులకు అసౌకర్యం కలగకుండా విద్యుత్ సరఫరా నిరంతరాయంగా ఉండేలా చూడాలని ఆదేశించారు. తగినంత లడ్డూల బఫర్ స్టాక్‌ను ఉంచాలని సూచించారు. యాత్రి కుల కోసం ఓఆర్ఎస్ ప్యాకెట్లను తగినంత నిల్వ ఉంచాలని వైద్య అధికారులతో అన్నారు. రాబోవు వేసవిలో తిరుమలలోని అన్ని ప్రాంతా ల్లో భక్తులకు అవసరమైన నీటిని సరఫరా చేసేందుకు ముందస్తు చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవోలు లోకనాథం, రాజేంద్ర, భాస్కర్, ట్రాన్స్‌పోర్ట్ జీఎం శేషారెడ్డి, వీజీవోలు రామ్ కుమార్, సురేంద్ర, అధికారులు పాల్గొన్నారు.

## ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

కరీంనగర్, ఫిబ్రవరి 28: మార్చి 28న ఏఐయూసీ చేపట్టిన ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏఐటీయూసీ స్టేట్ కౌన్సిల్ మెంబర్ మాడిశెట్టి కిరణ్ పిలుపునిచ్చారు. జగిత్యాలలో శుక్రవారం ఛలో పార్లమెంటు పోస్టర్ రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న సంక్షేమ చట్టంలో నిబంధనలు ఆయా రాష్ట్రాలకు అనుకూలంగా మార్పులు చేసుకునే నిబంధనలు ఉన్నాయని తెలిపారు.నష్టపరిహారంతో పాటు, 60 సంవత్సరాలు దాటిన వారికి పెన్షన్, వలస కార్మికులు (ఒక రాష్ట్రం నుంచి ఇతర రాష్ట్రాల్లో పనిచేయు వారికి) దేశంలో ఎక్కడైనా వర్తించే విధంగా గుర్తింపు కార్డులు ఉండాలని, సంక్షేమ బోర్డులను రద్దు చేసే ప్రతిపాదన ఉపసంహరించుకోవాలన్నారు.ఛలో ఢిల్లీ కార్యక్రమానికి పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో జిల్లా సెక్రటరీ రామిల్ల రాంబాబు, సలహాదారు మునిగురి హన్మంత్, సహాయక కార్యదర్శి మల్లారపు నర్సయ్య, ఉపాధ్యక్షుడు మామిడి రాజన్న, క్యాషియర్ పూదరి మల్లేశం, ప్రవీణ్, పనగంటి మల్లారెడ్డి, సతీష్ రావు, వెన్న మహేష్, అందె ప్రశాంత్,వేన్న మనీతేజ, రంజిత్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## కొడంగల్ ఎత్తిపోతల వల్ల 4.5 లక్షల ఎకరాలకు నష్టం : ఎమ్మెల్సీ కవిత

నాగర్‌కర్నూల్, ఫిబ్రవరి 28: కొడంగల్- నారాయణపేట్ ఎత్తిపోతల పథకం వల్ల పాలమూరు - రంగారెడ్డి కంపోనెంట్స్ తీసివేయడం వల్ల 4.5 లక్షల ఎకరాలకు నష్టం జరుగుతుందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టుకు బీమా నుంచి కాకుండా జూరాల నుంచి నీటిని తీసుకుంటే మంచిదని ఇంజనీర్లు చెబుతున్నారని తెలిపారు. నాగర్‌కర్నూల్‌లో ఎమ్మెల్సీ కవిత మీడియాతో మాట్లాడారు.

8 మంది ప్రాణాలు ఎస్ఎల్‌బీసీ సొరంగంలో కొట్టుమిట్టాడుతుంటే? కాంగ్రెస్ నాయకులు పార్టీ సమావేశానికి వెళ్లారు. ఒక్క మంత్రి కూడా ఘటనా స్థలం వద్ద ఇప్పుడు లేరంటే ప్రాణాలంటే కాంగ్రెస్ నాయకులకు లెక్కలేదనేది అర్థమవుతుంది. కేసీఆర్ హయాంలో ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌ను 11.5 కి.మీ. తవ్వినప్పుడు ఒక్క ప్రమాదం కూడా జరగలేదు. కేవలం ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ప్రమాదం జరిగినట్లు కార్మికులు చెబుతున్నదాన్ని బట్టి అర్థమవుతోంది. మట్టి, రాళ్లు పడుతున్నాయని కార్మికులు చెబుతున్నా ఏం కాదని చెప్పి పని చేయించారని కవిత పేర్కొన్నారు.

కల్వకుర్తి ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేసి లక్షల ఎకరాలకు సాగునీటిని అందించిన ఘనత కేసీఆర్‌ది. పాలమూరు - రంగారెడ్డి, డిండి ప్రాజెక్టులు కేసీఆర్ హయాంలో 60 శాతానికి పైగా పూర్తయ్యాయి. కేసీఆర్ ప్రభుత్వం నార్లాపూర్ వద్ద పంప్ హౌజ్‌ను కూడా ప్రారంభించింది. ఇప్పుడున్న ప్రభుత్వం నిజంగా నీళ్లు ఇవ్వాలనుకుంటే 8 టీఎంసీల నీటిని ఎత్తిపోయడానికి వ్యవస్థ సిద్ధంగా ఉందని కవిత తెలిపారు.

గత 15 నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాజెక్టుల్లో ఒక తట్ట మట్టి కూడా ఎత్తిపోయలేదు. కేసీఆర్ ఉన్నప్పుడు సక్రమంగా, సకాలంలో రైతులకు యూరియా లభించేది. కానీ ఇప్పుడు ఎందుకు రైతులకు యూరియా అందుబాటులో లేదు.. కేంద్రంతో కొట్లాడి కేసీఆర్ రాష్ట్రానికి ఎంత మేర యూరియా అవసరం అవుతుందో ముందే తెప్పించేవారని కవిత గుర్తు చేశారు.

తక్షణమే మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం. మహిళలకు నెలకు రూ. 2500, ఆడపిల్లలకు స్కూటీలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. హాస్టళ్లలో కనీసం సరైన భోజనం పెట్టడం కూడా కాంగ్రెస్ ప్రభుత్వానికి చేతకావడం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత మన బిడ్డలు చనిపోవడం మొదలైంది.

ఎస్సీ, ఎస్టీ, బీసీ ఫీజు రియింబర్స్‌మెంట్ జరగక చదువులు ఆగిపోయే పరిస్థితి ఏర్పడింది. అంబేద్కర్ ఓవర్సీస్ స్కాలర్‌షిప్ విడుదల చేయకపోవడం వల్ల విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. మెఘా కృష్ణా రెడ్డి వంటి వాళ్లకు నిధులు మంజూరు చేస్తున్న ప్రభుత్వం ప్రజలను మాత్రం నిర్లక్ష్యం చేస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దవాళ్లవైపే చూస్తుంది.. ప్రజల వైపు కాదు. కుల సర్వేకు సంబంధించి గ్రామాల వారీగా కులాల జనాభాను బహిర్గతం చేయాలి అని కవిత డిమాండ్ చేశారు.

## ఉన్నత విలువల ఖని బాబు రాజేంద్ర ప్రసాద్

**- జిల్లా కాంగ్రెస్ కమిటి అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్**

**- డిసిసి కార్యాలయంలో 62వ వర్ధంతి వేడుకలు**

ఖమ్మం, ఫిబ్రవరి 28: (నేటినిజం ప్రతినిధి): ఉన్నత విలువలు ప్రదర్శించి దేశ, విదేశీ ప్రముఖుల ప్రశంసలు అందుకున్న గొప్పయోధుడు బాబూ రాజేంద్రప్రసాద్ చిరస్మరణీయుడు అని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు దుర్గాప్రసాద్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావులు కొనియాడారు. జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవన్ లో భారతదేశపు మొట్టమొదటి రాష్ట్రపతి, ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు డాక్టర్ బాబు రాజేంద్ర ప్రసాద్ 62వ వర్ధంతి సందర్భంగా ముందుగా వారి చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించిన జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... డాక్టర్ బాబు రాజేంద్రప్రసాద్ భారతీయ రాజకీయ నాయకునిగా భారత జాతీయ కాంగ్రెస్ లో స్వాతంత్ర్యోద్యమ కాలంలో చేరి, బీహార్ లో ప్రముఖ నాయకునిగా ఎదిగినారని, జాతిపిత మహాత్మా గాంధీ మద్దతుదారునిగా 1931లో జరిగిన ఉప్పు సత్యాగ్రహం,1941లో జరిగిన క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని జైలుశిక్ష అనుభవించారని, భారత రాజ్యాంగ ముసాయిదా సంఘానికి అధ్యక్షత వహించారని, 1950లో భారతదేశం గణతంత్ర రాజ్యంగా అవతరించిన తరువాత రాజ్యాంగ పరిషత్తు ద్వారా భారతదేశపు మొట్టమొదటి రాష్ట్రపతిగా ఎన్నుకోబడిన 1950నుండి 1962 వరకు రాష్ట్రపతిగా కొనసాగారని, వారు రాష్ట్రపతిగా పక్షపాత దోరని లేకుండా వ్యవహరించేందుకు గాను కాంగ్రెసు పార్టీ రాజకీయాల నుండి వైదొలగి కొత్త సాంప్రదాయాన్ని నెలకొల్పారని, భారతదేశపు అభివృద్ధి కొరకు అహర్నిశలు కష్టపడి పనిచేశా రని కొనియాడారు, అటువంటి మహనీయులు చూపిన బాటలో నడవటమే మనం వారికిచ్చే ఘన నివాళులు అని అన్నారు. ఈ కార్యక్రమంలో వీరితో పాటు నగర కాంగ్రెస్ కమిటి కార్యనిర్వహక అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి, జిల్లా మహిళా, సేవాదళ్, మైనారిటీ అధ్యక్షులు దొబ్బల సౌజన్య, సయ్యద్ గౌస్, సయ్యద్ ముజాహిద్ హుస్సేన్, కార్పొరేటర్లు దుద్దుకూరి వేంకటేశ్వర రావు, రాపర్తి శరత్, కన్నం వైష్ణవి-ప్రసన్న, చామకూరి వెంకటనా రాయణ, మాజి కౌన్సిలర్ పాలకుర్తి నాగేశ్వర రావు, జిల్లా ఓబీసీ సెల్ ప్రధాన కార్యదర్శి బమ్మిడి శ్రీనివాస్ యాదవ్, గజ్జి సూర్య నారాయణ, ఆర్టీఏ మెంబర్ గజ్జెల్లి వెంకన్న, నగర ఓబీసీ, మైనారిటీ, ఎస్టీ సెల్ అధ్యక్షులు బాణాల లక్ష్మణ్, షేక్ అబ్బాస్ భేగ్, శంకర్ నాయక్, భూక్యా సురేష్ నాయక్, ఆలే సాయికిరణ్, నూకారపు వెంకటేశ్వరరావు, మాజీ ఎంపీటీసీ నల్లమోతు లక్ష్మయ్య, రజి భాయ్, ఫరీద్ ఖాద్రి, బలుసు లక్ష్మి, భవాని, ఊరుకొండ చంద్రిక, యూ సఫ్, జాకీర్, గోపాల్, బొమ్మ ఉదయ్, పర్వత శ్రీనివాస్, షేక్ పాషా, జెర్రిపో తుల అంజనీ కుమార్, బచ్చలికూరి నాగరాజు, శేషురెడ్డి తదితర నాయకులు పాల్గొన్నారు.

## చదువుతో పాటు పరిశోధనలపై దృష్టి పెట్టాలి

వరంగల్, ఫిబ్రవరి 28:చదువు ఎంత ముఖ్యమో పరిశోధనలు చేయాలనే జిజ్ఞాస అంతే ముఖ్యమని, శాస్త్రీయ ఫలాలు ప్రతి సామాన్యుడికి అందాలని ప్రధానోపాధ్యాయుడు బానోతు రవీందర్ అన్నారు. పాఠశాలలో నీవీ రామన్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. జాతీయ సైన్స్ దినోత్సవవేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులలో స్ఫూర్తిని రగిలించి భారతీయ యువ శాస్త్రవేత్తలుగా ఎదుగేందుకు తోడ్పాటును అందించాలన్నారు. రాబోయే తరం మరిన్ని ఆవిష్కరణలకు సంసిద్ధం కావాలంటే విద్యార్థి దశ నుంచే సైన్స్ పట్ల, భౌతిక నియమాల పట్ల ఆసక్తి కలిగి ఉండాలన్నారు.

నిత్య జీవితంలో మానవులకు ఎన్నో సమస్యలు ఎదురవుతాయని, వాటిని సైన్స్ పద్ధతిలో పరిష్కరించినపుడే ప్రగతి సాధ్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాలెపు విజయ, గాదె జోసెఫ్ బేబి, ఆవుల అమర్నాథ్, దొంతుల శ్రీనివాస్, గూడ నాగరాణి, తెజావత్ శ్రీనివాస్, నాగవెల్లి అనిత, అజహర్ సుల్తానా, మారోజు కవిత శ్రీ, పుప్పాల సుమలత, ఎం రవి, పాకాల కుమారస్వామి, గొపగొని సంధ్య, కౌడ లక్ష్మీనారాయణ, జంగ బాబు, తాడికొండ మహాలక్ష్మి, కన్నారపు అనూష, కరుణ, ఆర్ట్ టీచర్ సురేందర్, తదితరులు పాల్గొన్నారు.

## స్కూటీని ఢీ కొట్టిన లారీ.. కొడుకు మృతి, తండ్రికి తీవ్రగాయాలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 28:అతివేగంగా వెళుతున్న ఓ లారీ స్కూటీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కుమారుడు అక్కడికక్కడే దుర్మరణం చెందగా.. తండ్రికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన శుక్రవారం వికారాబాద్ జిల్లా తాండూరు మండలం చెంగోల్ గ్రామ సమీపంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి తాండూరు మండలం చెంగోల్ గ్రామానికి చెందిన ఈడిగి నర్సింలు (35) ఓ కిరణాషాపు నిర్వహిస్తున్నాడు.

అయితే తండ్రి గోపయ్య అనారోగ్యానికి గురికావడంతో శుక్రవారం తాండూరులోని ఆసుపత్రిలో చూపించుకుని తిరిగి బయల్దేరాడు. తండ్రి గోపయ్యను ఇంట్లో దించేందుకు ఇద్దరు కలిసి స్కూటీపై వెళుతున్నారు. చెంగోల్ సమీపంలోని బైపాస్ రోడ్డు సమీపంలో ఓ లారీ (టీఎస్34 టీబీ0118) వేగంగా వచ్చి వారి స్కూటీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నర్సింలు స్కూటీ పై నుంచి కిందపడి అక్కడికక్కడే మృతిచెందాడు. తండ్రి గోపయ్యకు గాయాలయ్యాయి.

స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. 108 సహాయంతో నర్సింలు మృతదేహాన్ని, తండ్రి గోపయ్యను తాండూరులోని జిల్లా ఆసుపత్రికి తరలించారు. నర్సింలు మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. గోపయ్యను పరిశీలించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ కు తరలించారు. మృతుడు నర్సింలుకు భార్య నర్మద, ఇద్దరు కుమారులున్నారు. నర్సింలు మృతితో కుటుంబీకుల రోధనలు మిన్నంటాయి. ప్రమాదానికి కారణం లారీ అతివేగంతో పాటు రాంగ్ రూట్‌లో వచ్చినట్లు స్థానికులు ఆరోపించారు. ఈ ప్రమాదంపై దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

## లంచం తీసుకుంటూ ఏసీబీకి దొరికిపోయిన పోలీస్ అధికారి..

లక్నో, ఫిబ్రవరి 28: ఒక వ్యక్తి నుంచి పోలీస్ అధికారి లంచం తీసుకున్నాడు. ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా దొరికిపోయాడు. ఆ పోలీస్ అధికారిని వారు అదుపులోకి తీసుకున్నారు. వాహనంలోకి ఎక్కించేందుకు ప్రయత్నించగా ఆయన తీవ్రంగా ప్రతిఘటించాడు.

ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఉత్తరప్రదేశ్‌లోని మీర్జాపూర్‌లో ఈ సంఘటన జరిగింది. చిల్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌వో శివశంకర్ సింగ్ ఒకరి నుంచి రూ.30,000 లంచం తీసుకున్నాడు.

మాటు వేసిన అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు ఆయనను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

కాగా, సివిల్ డ్రెస్‌లో ఉన్న ఏసీబీ అధికారులు శివశంకర్ సింగ్‌ను చుట్టుముట్టారు. ఆయనను అదుపులోకి తీసుకున్నారు. పోలీస్ స్టేషన్ నుంచి బయట ఉన్న వాహనం వద్దకు తీసుకెళ్లేందుకు ప్రయత్నించారు. అయితే ఆ పోలీస్ అధికారి తీవ్రంగా ప్రతిఘటించాడు.

వాహనం ఎక్కేందుకు నిరాకరించాడు. 'నా మాట వినండి, ఒక్క నిమిషం ఆగండి. నేను మీతో రాను' అంటూ వారిని ప్రాధేయపడ్డాడు.

మరోవైపు ఏసీబీ అధికారులు బలవంతంగా ఆ పోలీస్ అధికారిని తమ వాహనంలోకి ఎక్కించారు. అక్కడి నుంచి తీసుకెళ్లారు.

ఆ పోలీస్ స్టేషన్ వద్ద జరిగిన ఈ నాటకీయ సంఘటనకు సంబంధించిన వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.


తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో
అక్షరయాన్, సీతాస్, అఖిల భారతీ సంస్థల సంయుక్త నిర్వహణలో జరుగుతున్న
జాతీయ పదమ్సలో భాగంగా

సాహిత్య పురస్కారాలు 2024,2025

తేదీ :02-03-2025 @ 10 am
వేదిక: రవీంద్రభారతి, మొదటిఅంతస్తు

అక్షరయాన్ కళా విభాగం నిర్వహణలో
డా. బండారు సుజాతా శేఖర్ బృందం పాటలు
మహిళా ఒగ్గు నృత్యం .

10:30am - లలిత కళా వాహిని ఢిల్లీ వారు సమర్పిస్తున్న
మై నేమ్ ఈజ్ సీతాలు - హాస్య నాటిక
రచన : కీ.శే.ఎస్వే రావు గారు
దర్శకత్వం:శ్రీమతి మున్నంగి కుసుమ గారు

| | |
|---|---|
| లంక సీత | చెరుకూరి నాగమణి |
| వై.పార్వతి రెడ్డి | జగదీశ్వరి |
| యస్.శారద | ముల్లెల లక్ష్మి |
| గరిమెళ్ళ కరుణ | భావరాజు పద్మ |

సభా ప్రారంభం @ 11:30 am

ముఖ్య అతిథి : మాన్యశ్రీ సి.హెచ్. విద్యాసాగర్ గారు
పూర్వ గవర్నర్, మహారాష్ట్ర

అధ్యక్షులు : సుంకసారి రమేష్ గారు
IB(P)S కార్యక్రమ విభాగాధిపతి, ఆకాశవాణి హైదరాబాదు

విశిష్ట అతిథి: బైస దేవదాస్ గారు
ఎడిటర్, నేటి నిజం పత్రిక

గౌరవ అతిథి : కె.యం.రాధాకృష్ణన్ గారు
సంగీత దర్శకులు

ఆత్మీయ అతిథి : శ్రీమతి కనుమూరి జ్యోతి గారు
2024Mrs గ్రాండ్ ఇంటర్నేషనల్ లో బెస్ట్
టాలెంటెడ్ అవార్డు విన్నర్

సాహిత్య అవార్డుల ప్రదానం
2024,2025

1. తరిగొండ వెంగమాంబ
(కీ . శే చిట్లు ప్రమీల వితరణ )
డా .N. అనంత లక్ష్మి , రంగరాజు పద్మజ

2.బండారు అచ్చమాంబ
( బైస కళావతి వితరణ )
డా జయప్రద సోమిరెడ్డి ,గోగు శ్యామల

3.కుప్పాంబిక
(పొన్నం మల్లమ్మ వితరణ )
డా .ఆర్ . కమల , అనిశెట్టి రజిత

4. రంగాజమ్మ
(అయినంపూడి సరోజిని వితరణ )
డా. బండ సరోజన, డా. కురుమూరెడ్డి

5.కోడూరి లీలావతి
( కోడూరి కుటుంబం )
డి . కామేశ్వరి , డా . చాగంటి కృష్ణ కుమారి

జ్ఞాపకాలలో లీలాపద్మజం - పుస్తకావిష్కరణ

6. కోడూరి పద్మిని
( కోడూరి కుటుంబం )
ఆకెళ్ళ వెంకట సుబ్బలక్ష్మి , వి. శాంతి ప్రబోధ

7.యువ పురస్కారం
(మామిడి స్వరాజ్యం వితరణ )
సదా పంగా , కడలి

8. బాలికా పురస్కారం
( బండారు జయశ్రీ, శ్రీ ఫౌండేషన్)
ఐ.సౌమ్య, గిస శ్రీజ

9. బాలుర పురస్కారం
( డా. బండారు సుజాత శేఖర్, బతుకమ్మ ఫౌండేషన్ )
వలిపే రామ్ చేతన్ , డి.జతిన్ కుమార్

ప్రోత్సాహక బహుమతి
బర్రెడ్డి అంజన సాయి వేదాన్స్
(2 తరగతి)

10. అనువాద శిల్పి అవార్డు
స్వాతి శ్రీపాద

10. అక్షరయాన్ మోటివేటర్ అవార్డులు
డా. చివుకుల శ్రీలక్ష్మి
ములుగు లక్ష్మీ మైథిలి
తిరుకోవేల కిరణ్మయి

11. అక్షరయాన్ క్రియాశీలి అవార్డు
విశ్వైక

12. బాలల శిల్పి
ఘాలి లలిత ప్రవల్లిక

స్వీయ కృతుల గానం
"బాల వాగ్గేయకారిణి "రాచూరి శ్రీచందన

వ్యాఖ్యాతలు:
స్రవంతి, అనురాధ

వందన సమర్పణ
శోభా పేరిందేవి

# 2047 నాటికి వికసిత్ భారత్‌ను సాధించే దిశగా భారతీయ యువత సామర్థ్యాన్ని ఉపయోగించుకొనేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోంది: శ్రీ రాజ్‌నాథ్ సింగ్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 28:శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకొని నూతనంగా ఆవిర్భవిస్తున్న సాంకేతికత (ఫ్రాంటియర్ టెక్నాలజీ)ల్లో రాణించాలని రక్షణ మంత్రి శ్రీ రాజ్‌నాథ్ సింగ్ యువతకు పిలుపునిచ్చారు. ఈ అంశంలో అంతర్జాతీయ ప్రమాణాలతో ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న మౌలిక సదుపాయాలను ఉపయోగించుకోవాలని సూచించారు. జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా తెలంగాణలోని హైదరాబాద్‌లో రెండు రోజుల పాటు నిర్వహించే సైన్స్, టెక్నాలజీ మహోత్సవం విజ్ఞాన్ వైభవ్‌ను ఈ రోజు ఆయన ప్రారంభించారు.

"హార్డ్‌వేర్ నుంచి సాఫ్ట్‌వేర్ ఆధారితంగా– యుద్ధం మారిపోతున్నది. కృత్రిమ మేధ, క్వాంటమ్ కంప్యూటింగ్, మెషీన్ లెర్నింగ్, క్లీన్ – టెక్ తదితర నూతన సాంకేతికతలు అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో వాటిని అందుకోవడంలో మనం ముందు ఉండాలి. క్లిష్టమైన సాంకేతిక సవాళ్లకు పరిష్కారాలు ఉన్నట్లయితే.. విపత్కర పరిస్థితుల్లో సైతం భారత్ దృఢంగా, భద్రంగా ఉంటుంది. మన యువత శాస్త్రీయ దృక్పథాన్నీ, విమర్శనాత్మక ఆలోచనా ధోరణినీ అవలంబిస్తూ.. సాధారణ స్థాయిని అధిగమించి ముందుకు వెళ్లాలి" అని శ్రీ రాజనాథ్ సింగ్ అభిలషించారు. "మానవాళికి సైన్స్ అనేది ఓ అందమైన బహుమతి. దాన్ని దుర్వినియోగం చేయకుండా, సమాజాభివృద్ధికి ఉపయోగించాలి'' అని మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం చెప్పిన మాటలను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు.

ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వం దేశ భద్రత, రక్షణ కోసం ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకొనేందుకు కట్టుబడి ఉందని రక్షణ మంత్రి స్పష్టం చేశారు. దేశ భవిష్యత్తుకు ఈ రంగంలో విద్య చాలా అవసరమని అన్నారు. భారతీయ యువతకు అపారమైన సామర్థ్యం ఉందని, దానిని వికసిత్ భారత్ 2047 లక్ష్య సాధన కోసం ఉపయోగించుకొనేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని తెలిపారు.

దేశంలో శాస్త్రీయ విద్య రూపరేఖలను మారుస్తూ, సృజనాత్మకత, విమర్శనాత్మక ఆలోచనా ధోరణి, ఆవిష్కరణలను ప్రోత్సహించడమే లక్ష్యంగా రూపొందిన జాతీయ విద్యా విధానం 2020 గురించి శ్రీ రాజనాథ్ సింగ్ చర్చించారు. దీనిని ఈ ఏడాది జాతీయ సైన్స్ దినోత్సవం ఇతివృత్తమైన 'వికసిత్ భారత్ కోసం సైన్స్, ఆవిష్కరణల్లో అంతర్జాతీయ స్థాయిలో నాయకత్వం వహించేలా భారతీయ యువతకు సాధికారత కల్పించడం' కూడా ప్రతిఫలిస్తోందని తెలియజేశారు. సైన్సులో ఆవిష్కరణలు, అంతర్జాతీయ నాయకత్వం దిశగా పురోగతి సాధించాలన్న భారత్ ఆకాంక్షకు ఈ ఇతివృత్తం ప్రతిబింబమని ఆయన వివరించారు.

తెలంగాణ ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి ఈ కార్యక్రమంలో మాట్లాడుతూ సుదీర్ఘ కాలంగా సైన్సు, సాంకేతిక ఆవిష్కరణలకు హైదరాబాద్ కేంద్రంగా ఉందని తెలిపారు. విజ్ఞాన్ వైభవ్ 2025 కార్యక్రమంలో పాల్గొని పెద్ద లక్ష్యాలను నిర్దేశించుకోవాలని, ఆవిష్కరణ లపైదృష్టిపెటాలని యువతను ఆయన కోరారు.

ఈ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన ప్రదర్శనను 30,000 మందికి పైగా విద్యార్థులు సందర్శించారు. దీనిలో ఏర్పాటు చేసిన 200కు పైగా స్టాళ్ల ద్వారా డీఆర్‌డీవో, ప్రముఖ భారతీయ సంస్థలు అభివృద్ధి చేసిన అత్యాధునిక రక్షణ, ఏరోస్పేస్ సాంకేతికతల గురించి తెలుసుకునే అవకాశం విద్యార్థులకు లభిస్తుంది. అంతర్జాతీయంగా సాంకేతిక రంగంలో భారత్‌ను అగ్రస్థానంలో నిలిపే దిశగా యువతలో ఆసక్తిని పెంపొందించడం, ఆవిష్కరణలకు స్ఫూర్తినివ్వడం, స్టెమ్ రంగాల్లో కెరీర్ కొనసాగించేలా వారిని ప్రోత్సహించడానికి, తర్వాతి తరం శాస్త్రవేత్తలు, ఇంజనీర్లు, టెక్నో–ప్రెన్యూయర్లను ప్రోత్సహించడమే ఈ ఎగ్జిబిషన్ లక్ష్యం.

రక్షణ విభాగ కార్యదర్శి, డీఆర్‌డీవో ఆర్ అండ్ డీ ఛైర్మన్ డాక్టర్ సమీర్ వి కామత్, ఏరోనాటికల్ సొసైటీ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు డాక్టర్ జి సతీష్ రెడ్డి, డీఆర్‌డీవోకు చెందిన డైరెక్టర్ జనరళ్లు, డైరెక్టర్లు, ప్రభుత్వ రంగ సంస్థల సీఎండీలు, పరిశ్రమల అధినేతలు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

ప్రఖ్యాత శాస్త్రవేత్త సర్ సీవీ రామన్ సైన్సు రంగంలో చేసిన సేవలకు గుర్తింపుగా జాతీయ సైన్స్ దినోత్సవాన్ని నిర్వహిస్తారు. ఈ సందర్భంగా డీఆర్‌డీవో, ఏఈఎస్ఐ, కలామ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ యూత్ ఎక్సలెన్స్ సంయుక్తంగా విజ్ఞాన్ వైభవ్ కార్యక్రమాన్ని నిర్వహించాయి. విధాన రూపకర్తలు, శాస్త్రవేత్తలు, పారిశ్రామిక దిగ్గజాలు, విద్యావేత్తలు, యువ ఆవిష్కర్తలను ఒక్క చోట చేర్చి దేశ భవిష్యత్తును రూపొందించడంలో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించి, వాటిని ప్రదర్శించే వేదికను ఏర్పాటు చేసింది. స్వయం సమృద్ధిని, వికసిత్ భారత్ 2047 లక్ష్యాన్ని సాధించే దిశగా, శాస్త్రీయ నైపుణ్యం, ఆవిష్కరణలు, సహకారంతో మార్గాన్ని సుగమం చేస్తుంది.

# నాలుగో తేదీ నుంచి చండూరు జాతర ప్రారంభం..!

నల్గొండ, ఫిబ్రవరి 28:మార్చి నాలుగో తేదీ నుంచి తొమ్మిదో తేదీ వరకూ చండూరు జాతర జరుగనున్నది. శుక్రవారం మార్కండేశ్వర స్వామి దేవాలయంలో జరిగిన సమావేశంలో దేవాలయ చైర్మన్ రావిరాల నగేష్ జాతర కరపత్రాలను విడుదల చేశారు. మార్చి నాలుగో తేదీన పార్వతీ పరమేశ్వరుల కళ్యాణం, 6న గాయత్రి యజ్ఞం, 7న విమాన రథోత్సవం, 8న అగ్నిగుండాలు, 9న భూ,నీళా సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయి.

ఈ సమావేశానికి దేవాలయ చైర్మన్ రావిరాల నగేష్ సారధ్యం వహించారు. ఈ సమావేశంలో కోమటి వీరేశం, గుర్రం బిక్షమయ్య, పులిపాటి ప్రసన్న, గుంటి వెంకటేశం, గంజి శ్రీనివాసులు, చిట్టిప్రోలు వెంకటేశం, చెరువల్లి వెంకటేశం,చెరుపల్లి అంజయ్య, రావిరాల నగేష్, కోడి వెంకన్న, కోడి శ్రీనివాసులు,రాపోలు వెంకటేశం జూలూరు వెంకటేశం,తిరందాసు శ్రీనివాసులు, దుస్స గణేష్, సంగెపు మల్లేష్, రాపోలు ప్రభాకర్, గుంటి యాదగిరి, గంజి గంగాధర్, అశోక్, కలిమికొండ కిరణ్, చిలుకూరి మణికుమార్, బొల్ల శ్రీకాంత్, తిరందాసు భాస్కర్,గంజి భిక్షం, చెరుపల్లి సాయి, ఏలే శ్రీనివాసులు, ఆలయ పూజారులు గుర్రం సత్యనారాయణ, చెరుపల్లి వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

# మతాన్ని సంకుచిత, సాంప్రదాయిక పద్ధతిలో చూడలేము.. పరిమిత సరిహద్దుల్లో మతాన్ని అంచనా వేయలేము-ఉపాధ్యక్షుడు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 28:ఉపాధ్యక్షుడు శ్రీ జగదీప్ ధన్‌కర్ ఈ రోజు మాట్లాడుతూ అజ్ఞానం వల్ల కొందరు ఆధ్యాత్మికత వంటి మన పవిత్రమైన అంశాలను మూఢనమ్మకాలుగా ముద్రవేస్తున్నారు. సనాతన్ అంటే కలుపుకుపోవడాన్ని నొక్కి చెబుతూ, శ్రీ ధనఖర్ ఇలా పేర్కొన్నాడు, "కొంతమంది, అజ్ఞానం వల్ల లేదా విషయాల అర్థాన్ని గుడ్డిగా వెంబడించడం వల్ల, మన పవిత్రమైన అంశాలైన ఆధ్యాత్మికతను మూఢనమ్మకాలుగా తప్పుగా ముద్రవేస్తారు."

"ఈరోజు అన్నిటికీ సనాతన్‌లో సమాధానం దొరుకుతుంది. ప్రపంచంలో ఎక్కడ ఉన్నా నేటి వ్యవస్థకు సనాతన్ బోధించేది చాలా అవసరం. సనాతన్ అంటే సమగ్రతను సూచిస్తుంది, సనాతన్ అంటే విశ్వవ్యాప్త మంచితనాన్ని సూచిస్తుంది, సనాతన అంటే ఆత్మ యొక్క ఆధిపత్యాన్ని సూచిస్తుంది. లొంగదీసుకోవడంలో సనాతనానికి నమ్మకం లేదు. మీరు సనాతనానికి లొంగిపోతే, మీరు బందీ కాదు, మీరు స్వేచ్ఛా వ్యక్తి, స్వేచ్ఛా ఆత్మ అవుతారు", అని ఆయన అన్నారు.

"మతాన్ని సంకుచిత, సంప్రదాయవాద పద్ధతిలో చూడలేము. పరిమిత హద్దుల్లో మతాన్ని అంచనా వేయలేం. మతం యొక్క నిజమైన అర్థాన్ని మనం అర్థం చేసుకోవాలి మరియు భారతదేశాన్ని మరోసారి 'విశ్వ గురువు'గా మార్చడానికి మనమందరం సంకల్పించాల్సిన అవసరం ఉందని అప్పుడే మనం గ్రహిస్తాము. మరియు భారతదేశం 'విశ్వ గురువుగా మారడం ప్రపంచానికి గొప్ప శుభ సందేశం' అని ఆయన అన్నారు.

గౌడియ మిషన్ వ్యవస్థాపకుడు ఆచార్య శ్రీల భక్తి సిద్ధాంత సరస్వతీ గోస్వామి ప్రభుపాద 150వ జయంతి ముగింపు కార్యక్రమంలో సభను ఉద్దేశించి శ్రీ ధనఖర్ మాట్లాడుతూ, "మన సంస్కృతిలో మనం క్రూరత్వం, దండయాత్రలు, అనాగరికత, మత విధ్వంసం, అనాగరికత, ఏ విధమైన విధ్వంసాన్ని చవిచూశాం. చిహ్నాలు! నలందకు నిప్పంటించినప్పుడు, ఏమి నాశనం చేయబడిందో ఒక్కసారి ఊహించుకోండి! నలందకు ఎన్ని అంతస్తులు ఉన్నాయి, ఎన్ని లక్షల పుస్తకాలు ఉన్నాయి, అవి భారతదేశానికే కాదు, యావత్ ప్రపంచానికి సంబంధించినవి. నేటి సాంకేతిక పరిజ్ఞానం యొక్క పురోగతి మన జ్ఞాన నిధిలో నిల్వ చేయబడిన జ్ఞానానికి కొంత సంబంధాన్ని కలిగి ఉంది.

తన ప్రసంగంలో ఆయన ఇంకా ఇలా అన్నారు, "ఇది శ్యామా ప్రసాద్ ముఖర్జీ భూమి, జాతీయవాదం విషయంలో ఎప్పుడూ రాజీపడలేదు. మరియు అది ఎంత పెద్ద త్యాగం! శ్యామా ప్రసాద్ ముఖర్జీకి ఉన్న ఆందోళనలు, ఆయన ఆలోచనలు, జాతీయవాదం పట్ల ఆయనకున్న నిబద్ధత, ఆయన చూసిన చీమపట్టిన గాయం ఇప్పుడు మన రాజ్యాంగంలో లేని అదృష్ట సమయంలో మనం ఉన్నాం".

# బీసీ బాలిక హాస్టల్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తా : ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 28: బీసీ బాలికల వసతి గృహంలో నెలకొన్న సమస్యలను సత్వరమే పరిష్కరింపజేస్తానని ఎల్‌బీనగర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి తెలిపారు. మన్సూరాబాద్ డివిజన్ చిత్ర సినిమా కాలనీలోని బీసీ బాలికల వసతి గృహాన్ని శుక్రవారం ఆయన పరిశీలించి అక్కడ నెలకొన్న సమస్యలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మాట్లాడుతూ.. రాబోయే వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని విద్యార్థులకు ఎలాంటి ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా ఉండేందుకుగాను చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. విద్యార్థులకు స్వచ్ఛమైన మంచినీటిని అందించాలనే లక్ష్యంతో ముందస్తుగా బీసీ హాస్టల్‌కు వాటర్ ప్యూరిఫైడ్‌ను అందజేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు త్వరలో జరగబోయే వార్షిక పరీక్షలకు సిద్ధమై మంచి ఫలితాలను రాబట్టాలని సూచించారు. హాస్టల్‌లో ఎలాంటి సమస్యలు ఎదురైన వాటిని తన దృష్టికి తీసుకురావాలని.. యుద్ధ ప్రాతిపదికన వాటిని పరిష్కరింపజేస్తానన్నారు.

ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్ రెడ్డి, డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు జక్కిడి మల్లారెడ్డి, నాయకులు పోచబోయిన జగదీష్ యాదవ్, టంగుటూరి నాగరాజు, జక్కిడి రఘువీర్ రెడ్డి, సూరజ్ యజ్ఞని, విజయ భాస్కర్ రెడ్డి, సిద్ధగొని జగదీష్ గౌడ్, ఆనంద్, హాస్టల్ సిబ్బంది రమేష్, సంధ్య, విఠల్ తదితరులు పాల్గొన్నారు.

# సర్వే ఆఫ్ ఇండియాలో సైన్స్ డే వేడుకలు

హైదరాబాద్, ఫిబ్రవరి 28: ఉప్పల్‌లోని సర్వే ఆఫ్ ఇండియాలో సైన్స్ డే వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రకాల ప్రదర్శనలు చేపట్టారు . పలు విద్యాసంస్థల విద్యార్థులు హాజరై సర్వే ఆఫ్ ఇండియాలో చేస్తున్నటువంటి విజ్ఞాన సంబంధించిన యంత్రాలు, పరికరాలను గురించి తెలుసుకున్నారు .ఈ సందర్భంగా సైన్స్ ప్రాధాన్యతను తెలియజేసే విధంగా పరికరాల ఉపయోగం , వాటి సద్వినియోగంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సర్వే ఆఫ్ ఇండియాలో ప్రధానంగా డ్రోన్ ద్వారా చేపడుతున్న సర్వే వివరాలు, సమగ్ర సమాచారం విద్యార్థులకు అందించారు. 1986 నుంచి సర్వే ఆఫ్ ఇండియాలో సైన్స్ డే నిర్వహణ చేపడుతున్నట్లు పేర్కొన్నారు. డ్రోన్ జీఎన్ఎస్ఎస్ , డిజిటల్ లెవెల్, ఫోటో గ్రావిటీ, లాడార్ రిమోట్ సెన్సింగ్, త్రీడీ జీఐఎస్ ప్రధానంగా వీటి ఆవశ్యకతను తెలియజేశారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో చేపడుతున్న సర్వేకు సంబంధించిన స్వామిత్వ, నక్ష సంబంధించిన అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమానికి అడిషనల్ సర్వేయర్ జనరల్ జి వరుణ కుమార్, డిప్యూటీ సర్వేయర్ జనరల్ పంకజ్ మిశ్రా హాజరై సైన్స్ డే ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సూపరిండెంట్ సర్వేయర్ సంతోశ్ , పంకజ్ సింగ్ కలాం, ఆఫీసర్ సర్వేయర్ రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్థిక క్రమశిక్షణతో కూడిన పొదుపే భవిష్యత్తుకు భరోసా

కరీంనగర్, ఫిబ్రవరి 28:ఆర్థిక క్రమశిక్షణతో కూడిన పొదుపే భవిష్యత్తుకు భరోసా అని అడిషనల్ కలెక్టర్ బీఎస్ లత అన్నారు. రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా ఫిబ్రవరి 24 నుంచి 28 వరకు దేశవ్యాప్తంగా 'ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలు' నిర్వహిస్తున్న తరుణంలో ఈరోజు జిల్లా లీడ్ బ్యాంక్ కార్యాలయం ఆధ్వర్యంలో కలెక్టరేట్ మీటింగ్ హాలులో ఏర్పాటు చేసిన వారోత్సవాల ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి తమ ఆదాయ, వ్యయాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు.

ఎదుటి వారిని చూసి ఆడంబరాలకు పోయి తమ ఆర్థిక స్థోమతకు, ఆదాయానికి మించి ఖర్చులు చేస్తున్నారని తద్వారా వాటి కోసం అప్పులు చేస్తూ అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారన్నారు.

జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ రామ్ కుమార్ మాట్లాడుతూ ప్రతి వ్యక్తికి ఎంత సంపాదిస్తున్నమన్నది కాకుండా ఎలా ఖర్చు చేస్తున్నామన్నదే ప్రధానం అన్నారు. దాని పైనే మన వ్యక్తిగత ఆర్థికాభివృద్ధి ఆధారపడి ఉంటుందని

ఆయన తెలిపారు. పొదుపు చేయడానికి బ్యాంకులు, పోస్టాఫీసులు, ప్రభుత్వ రంగ సంస్థలను మాత్రమే ఎంచుకోవాలని అప్పుడే మీ పొదుపు డబ్బులకు సరైన భద్రత, భరోసా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారిణి సత్యమ్మ, బిసి సంక్షేమ అధికారిణి సునీత, జిల్లా ఎఫ్ఎల్సీ కోట మధుసూదన్, వివిధ శాఖల మహిళా ఉద్యోగులు సిబ్బంది పాల్గొన్నారు.

# ఆధునిక సాంకేతిక పరిజ్ఞాన వినియోగంలో తెలంగాణ జైళ్ల శాఖ నంబర్ వన్

హైదరాబాద్, ఫిబ్రవరి 28: దేశంలోనే ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవడంలో తెలంగాణ జైళ్ల శాఖ ముందుందని తెలంగాణ రాష్ట్ర పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ డైరెక్టర్ వివి శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం చంచల్‌గూడ జైళ్ల శాఖ ఆవరణలోని ఆడిటోరియంలో జరిగిన జైళ్ల శాఖ సిబ్బందికి ఆధునిక ఎలక్ట్రానిక్స్ గ్యాడ్జెట్ల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.

జ్యుడిషియల్, జైలు, పోలీసు, ఫోరెన్సిక్ శాఖలు సమన్వయంతో పని చేయడం ద్వారా నేరాలను అదుపు చేయడంతో పాటు వాటిని నివారించడానికి బోధపడుతుందన్నారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో విప్లవాత్మక మార్పులు జైళ్ల శాఖలో వచ్చాయన్నారు. దేశంలో ఐదు రాష్ట్రాల్లోనే ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుంటున్న దక్షిణాది రాష్ట్రాలతో పాటు గుజరాత్ రాష్ట్ర జైళ్ళు ఉన్నాయని, ఈ రాష్ట్రాలు మిగతా రాష్ట్రాల జైళ్ళకు ఆదర్శంగా నిలిచాయని శ్రీనివాసరావు పేర్కొన్నారు.

జైళ్ల శాఖ డీజీ డాక్టర్ సౌమ్య మిశ్రా మాట్లాడుతూ.. జైళ్ల శాఖలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని, అందులో భాగంగా రాష్ట్రంలోని అన్ని జైళ్లకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం పరికరాలను అందజేస్తున్నామని ఆమె తెలిపారు.

ఈ కార్యక్రమంలో జైళ్ల శాఖ ఐజీలు శ్రీనివాస్,రాజేష్, డిఐజీ సంపత్ సంపత్, జైళ్ల శాఖ అధికారులు, రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి విచ్చేసిన అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నిషేధిత మావోయిస్టు సిపిఐ పార్టీకి చెందిన ఇద్దరు సభ్యులు కామారెడ్డి ఎస్పి సీందూ శర్మ ఎదుట లొంగి పోయారు..

కామారెడ్డి, ఫిబ్రవరి 28: (నేటినిజం ప్రతినిధి): కామారెడ్డి జిల్లా ఎస్పి సింధు శర్మ ఎదుట నిషేదిత మావోయిస్టు పార్టీకి చెందిన అజ్ఞాతంలో వున్న (02) ఇద్దరు సభ్యుల లొంగుబాటు పోయారు. వలస్టుల పట్ల చూపిస్తున్న ఆదరణను హింసాత్మక ఘటనల్లో ప్రత్యక్షంగా పాల్గొని లొంగిపోయిన ఇద్దరు మావోయిస్టు సభ్యులు,పోరు వద్దు !! ఊరు ముద్దు !! నినాదంతో ఆయుధాలను మరియు అజ్ఞాతాన్ని వీడి జనజీవన స్రవంతిలో కలిశారు.లొంగిపోతే పునరావాసం కల్పిస్తామన్న. జిల్లా ఎస్పి సింధు శర్మ. శుక్రవారం 28.02.2025 న నిషేదిత సిపిఐ మావోయిస్టు పార్టీకి చెందిన (2) ఇద్దరు సభ్యులు జిల్లా పోలీసుల ఎదుట లొంగిపోయినట్లు ఆమె తెలిపారు.. పోలీస్ శాఖ ప్రజలకు చేస్తున్నటువంటి వివిధ రకాల సహాయ సహకారాలు మరియు లొంగిపోయిన మావోయిస్టు సభ్యులు వివరములు: 1. గుర్రాల విజయ్ కుమార్ ఏ ఆకాష్ ఎ/ చంద్ర శేఖర్ (లేట్), (36)కులం : గొ (నాయక్ పార్ట్ ), ఛెర్ల గ్రామం, బద్రాద్రి కొత్తగూడెం జిల్లా, తెలంగాణ రాష్ట్రం.అండర్ (గ్రౌండ్ కెడర్ / టెక్నికల్ టీం మెంబర్) , 2022 సంవత్సరంలో హిడ్మా నాయకత్వంలోని సిపిఐ మావోయిస్టు పి ఎల్ జి ఏ 1బబి బెటాలియన్ లో పార్టీ మెంబర్ గా చేరారు. పార్టీలో కావలసిన వస్తువులను సరపరా చేసేవాడు. ఇలా రెండు సంవత్సరాలు సిపిఐ మావోయిస్టు పార్టీలో సప్లై టీం మెంబర్ గా పనిచేసాడు. 2024 ఇతడిని టెక్నికల్ టీం మెంబర్ గా తీసుకున్నారు. అ తరువాత నుండి ఇతను అజ్ఞాతము లోకి వెళ్ళి బెటాలియన్ లో టెక్నికల్ టీం మెంబర్ గా కొనసాగాడు.

# అయుధాల అప్పగింతకు ఇదే చివరి అవకాశం.. గడువు పొడిగించిన మణిపూర్ గవర్నర్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 28: మణిపూర్ ప్రజలు ఆయుధాలను అప్పగించేందుకు ఆ రాష్ట్ర గవర్నర్ అజయ్ కుమార్ భల్లా చివరి అవకాశం ఇచ్చారు. ప్రజలు స్వచ్ఛందంగా ఆయుధాలు అప్పగిస్తుండటంతో గడువును పొడిగించారు. ఫిబ్రవరి 20 నుంచి అమలులోకి వచ్చిన వారం రోజుల గడువు గురువారంతో ముగిసింది. ఈ నేపథ్యంలో ఈ గడువును మార్చి 6 సాయంత్రం 4 గంటల వరకు గవర్నర్ పొడిగించారు. కొండ, లోయ ప్రాంతాల ప్రజలు అదనపు సమయం కోరడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. శుక్రవారం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. 'స్వచ్ఛందంగా ఆయుధాలను అప్పగించడానికి ఏడు రోజుల గడువు ముగిసింది. ఈ వ్యవధిని పొడిగించాలని లోయ, కొండ ప్రాంతాల ప్రజల నుంచి అభ్యర్థనలు వచ్చాయి. ఈ అభ్యర్థనలను నేను పరిగణనలోకి తీసుకున్నా. మార్చి 6 సాయంత్రం 4 గంటల వరకు గడువును పొడిగించాలని నిర్ణయించుకున్నా' అని అందులో పేర్కొన్నారు.

కాగా, పొడిగించిన గడువులోగా భద్రతా దళాల నుంచి దోచుకున్న, చట్టవ్యతిరేకంగా కలిగి ఉన్న ఆయుధాలను అప్పగించే వారిపై ఎలాంటి శిక్షార్హమైన చర్యలు తీసుకోబోమని గవర్నర్ అజయ్ కుమార్ భల్లా మరోసారి భరోసా ఇచ్చారు. 'శాంతి, మత సామరస్యం, మన యువత భవిష్యత్తు, మన సమాజ భద్రతకు దోహదపడటానికి సంబంధిత ప్రతి ఒక్కరికీ ఇదే చివరి అవకాశం' అని తాజా ప్రకటనలో స్పష్టం చేశారు.

మరోవైపు 2023 మే నుంచి మణిపూర్‌లోని మైతీ, కుకీ జాతుల మధ్య ఏడాదిన్నర కాలం పైగా ఘర్షణలు కొనసాగాయి. హింసాత్మక సంఘటనల్లో 250 మందికి పైగా మరణించగా వేలాది మంది ప్రజలు నిరాశ్రయులయ్యారు. ఫిబ్రవరి తొలి వారంలో సీఎం ఎన్ బీరేన్ సింగ్ తన పదవికి రాజీనామా చేశారు. ఈ నేపథ్యంలో ఫిబ్రవరి 13న మణిపూర్‌లో రాష్ట్రపతి పాలనను కేంద్రం విధించింది.

# హోలిస్టిక్ హెల్త్ అండ్ న్యూట్రిషన్ ఛాంపియన్ ల్యూక్ కౌటిన్హో న్యూ ఢిల్లీలోని అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించారు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 28:ప్రఖ్యాత హోలిస్టిక్ హెల్త్ కోచ్ మరియు ల్యూక్ కౌటిన్హో హోలిస్టిక్ హీలింగ్ సిస్టమ్స్ సహ వ్యవస్థాపకుడు, మిస్టర్. ల్యూక్ కౌటిన్హో పోషణ్ అభియాన్ అమలును ప్రత్యక్షంగా చూసేందుకు ఈరోజు న్యూ ఢిల్లీలోని కుసుంపూర్ పహారీ ఎఅఆూ ప్రాజెక్ట్ ంచిఅ 55 ఉ 59లోని ఖీఖ పురంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు.

ఈ సందర్శన సాక్షం అంగన్‌వాడీ మరియు పోషణ్ 2.0 (మిషన్ పోషణ్ 2.0) ద్వారా పోషకాహార లోపాన్ని పరిష్కరించడానికి భారత ప్రభుత్వ నిబద్ధతకు అనుగుణంగా ఉంటుంది, ఇందులో సామాజిక ప్రవర్తనా మార్పు మరియు సమాజ భాగస్వామ్యం ప్రధాన అంశం.తన పర్యటన సందర్భంగా, సమాజంలో పోషకాహారం మరియు బాల్య విద్యను బలోపేతం చేయడంలో నిమగ్నమై ఉన్న ముఖ్య వాటాదారులుగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలతో మిస్టర్ కౌటిన్హో సంభాషించారు. అతను అంగన్‌వాడీ కేంద్రంలోని పిల్లలతో కూడా సంభాషించాడు మరియు మంచి పోషకాహారం మరియు ఆరోగ్యకరమైన జీవనశైలి పద్ధతుల పట్ల అందరినీ ప్రేరేపించాడు.

అంగన్‌వాడీ కేంద్రాలలో మౌలిక సదుపాయాలు మరియు సేవల పంపిణీని పర్యవేక్షించే అధునాతన ఎ గవర్నెన్స్ సాధనమైన 'పోషన్ ట్రాకర్' అప్లికేషన్ ద్వారా పోషకాహార సేవల యొక్క నిజ–సమయ ట్రాకింగ్ ఎలా జరుగుతుందో అతను చూశాడు.

24 భాషలలో అందుబాటులో ఉన్న ఈ సాధనం, లబ్ధిదారులకు మెరుగైన సేవా సామర్థ్యాన్ని నిర్ధారిస్తూ, రియల్ టైమ్ డేటా సేకరణ మరియు లక్ష్య జోక్యాలను సులభతరం చేసింది.

ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ, స్థూలకాయ వ్యతిరేక ప్రచారం మరియు వంట కోసం ఎడిబుల్ ఆయిల్‌ను తగ్గించాలనే క్లారియన్ కాల్‌ను ప్రశంసిస్తూ, పోషణ్ అభియాన్ కింద పోషన్ మాహ్ మరియు పోషన్ పఖ్వాడ అనే వార్షిక జన్ ఆందోళన్ ఈవెంట్‌ల ద్వారా ఓనీచిఅఆ చేస్తున్న అవగాహన మరియు సమాజ చైతన్యం గురించి శ్రీ ల్యూక్ మాట్లాడారు.

# ఆస్తి ఇవ్వబోనని హెచ్చరించిన తండ్రి.. ఇంటి నుంచి కోటి చోరీ చేసిన కొడుకు

లక్నో, ఫిబ్రవరి 28: చెడు సహవాసం పట్టిన కొడుకును తండ్రి మందలించాడు. ఆస్తి ఇవ్వబోనని, ఇంటి నుంచి వెళ్లగొడతానని హెచ్చరించాడు. దీంతో ఆ కుమారుడు తండ్రిపై ప్రతీకారం తీర్చుకున్నాడు. స్నేహితులతో కలిసి ఇంట్లో దొంగతనానికి పాల్పడ్డాడు. కోటి విలువైన డబ్బు, నగలను చోరీ చేశాడు. ఫిర్యాదు అందుకున్న పోలీసులు వారిని అరెస్ట్ చేశారు. ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌లో ఈ సంఘటన జరిగింది. పాంకి ప్రాంతానికి చెందిన వ్యాపారవేత్త బట్టలకు రంగులు వేసే ఫ్యాక్టరీని నిర్వహిస్తున్నాడు.

పదో తరగతి చదువుతున్న అతడి కుమారుడు తన స్నేహితులతో చెడు సహవాసం చేస్తున్నాడు. చెడ్డ పనులతో దారి తప్పుతున్నాడు.

కాగా, కొడుకు తీరుపై తండ్రి ఆగ్రహం వ్యక్తం చేశాడు. చెడు సహవాసాలు మానకపోతే ఆస్తి ఇవ్వబోనని, వీలునామా రద్దు చేస్తానని, ఇంటి నుంచి పంపివేస్తానని కుమారుడ్ని హెచ్చరించాడు. దీంతో తండ్రిపై ప్రతీకారం తీర్చుకునేందుకు ఆ యువకుడు ప్లాన్ వేశ

# సైన్స్ ఫెయిర్‌తో విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందుతుంది..

-విద్యార్థుల ప్రతిభను వెలికి తీసేందుకు సైన్స్ ఫెయిర్ ఎంతో దోహదపడుతుంది...

– బిజెపి జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి

కరీంనగర్, ఫిబ్రవరి 28: (నేటినిజం ప్రతినిధి) సైన్స్ ఫెయిర్ తో విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందుతుందని , విద్యతోపాటు విద్యార్థుల్లో శాస్త్ర సాంకేతిక అంశాలోని నైపుణ్యాలను వారి ప్రతిభను వెలికి తీసేందుకు సైన్స్ ఫెయిర్ ఎంతో దోహదపడుతుందని బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. కరీంనగర్ పట్టణంలోని శ్రీ చైతన్య స్కూల్ వావిలాలపల్లి, విద్యారణ్య పూరి బ్రాంచ్ ల లో శుక్రవారం రోజున జరిగిన సైన్స్ ఫెయిర్ కార్యక్రమానికి బిజెపి జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సైన్స్ ఫెయిర్ లో విద్యార్థుల వైజ్ఞానిక , ఇతర ప్రదర్శనలను గంగాడి కృష్ణారెడ్డి తిలకించి , పలువురు విద్యార్థులతో మాట్లాడారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి గంగాడి కృష్ణారెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల మేదో సంపత్తిని గుర్తించడానికి కొన్ని సైన్స్ ఫెయిర్ కీలకంగా మారాయన్నారు. వైజ్ఞానిక మేలాల్లో సైన్స్ నమూనా ప్రాజెక్టులు విద్యార్థుల ప్రతిభ, సృజనాత్మకతకు దర్పణంగా నిలుస్తున్నాయన్నారు. ముఖ్యంగా పాఠశాల దశ నుంచి సైన్స్, గణితం సబ్జెక్టుల్లో పట్టు సాధించే విధంగా విద్యార్థులను తయారు చేయడంలో ఈ ప్రదర్శనలు ఎంతో దోహదం చేస్తాయన్నారు. దేశానికి శాస్త్ర సాంకేతిక వైజ్ఞానాన్ని అందించిన ఎంతోమంది మహానుభావులు ఉన్నారని , ఆర్యభట్ట మొదలుకొని అబ్దుల్ కలాం వరకు ఎంతోమంది ఆ దిశలో కృషి చేశారని , వారి స్ఫూర్తి గా తీసుకొని విద్యార్థులు ముందు కొనసాగాలని ఆయన ఈ సందర్భంగా విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ కార్పొరేటర్ కొలగానీ శ్రీనివాస్ , నాయకులు పాదం శివరాజ్ , బండారి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# అల్ఫోర్స్ స్కూల్ ఆఫ్ జెనెక్ట్ ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు

కరీంనగర్, ఫిబ్రవరి 28: (నేటినిజం ప్రతినిధి) స్థానిక వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ జెన్ నెక్స్ లో జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అల్ఫోర్స్ సంస్థల అధినేత డా. వి.నరేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై వారు మాట్లాడారు ప్రారంభానికి ముందు వారు ప్రాంగణంలో ఏర్పాటు చేసినటువంటి సి.వి రామన్ చిత్రపటానికి పూలమాల వేసి వారు చేసిన సేవలను స్మరించుకున్నారు.సి.వి రామన్ భారతదేశం గర్వించదగ్గ శాస్త్రవేత్త అని మరియు వారి చిన్ననాటి నుండి సైన్స్ శాస్త్రంలో నిర్విరామంగా కృషిచేశారని మరియు సైన్సో అనేక విషయాలను కనుగొన్నారు అని గుర్తుచేశారు సైన్స్ శాస్త్రంలో మక్కువ పెంచుకొని అనేక అద్భుతాలను సృష్టించి ప్రపంచవ్యాప్తంగా ఒక ప్రత్యేక గుర్తింపు పొందాలని గుర్తుచేస్తూ వారిని అనుసరించి విద్యార్థులందరు ప్రత్యేకమైన ప్రణాళిక రూపొందించుకొని సైన్స్ లో పట్టుసాధించి నూతన ఆవిష్కరణకు సిద్ధం కావాలని సూచించారు. వారిని స్ఫూర్తిగా తీసుకొని ప్రతి విద్యార్థి సైన్స్ లో నిష్ణాతులై అందులో కొత్త విషయాలు కనుగొని ప్రపంచ అభివృద్ధికి బాసటగా నిలవాలని పిలుపునిచ్చారు.సి.వి రామన్ రూపొందించినటువంటి రామన్ ఎఫెక్ట్ గుర్తింపబడినటువంటి రోజున మన భారతదేశంలోనే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా సైన్స్ దినోత్సవాన్ని చాలా వేడుకగా అట్టహాసంగా వివిధ రకాల కార్యక్రమాలతో ఘనంగా నిర్వహిస్తారని చెప్పారు. సర్ సి.వి రామన్ ప్రత్యేకమైనటువంటి పథకాల రూపొందించడమే కాకుండా వాటిని అమలు పరిచే విధానాలను చాలా చక్కగా తెలియపరుస్తూ విద్యార్థులందరూ సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని మరియు కొత్త విషయాలు తెలుసుకొని సమాజాభివృద్ధికి బాసరగా నిలవాలని వారు గుర్తు చేశారు. వలు నమూనాలు చాలా ఆలోచింప చేయడమే కాకుండా జ్ఞానాన్ని పెంపొందించాలని వారు చెప్పారు ప్రత్యేకంగా శ్రీరాంసాగర్ ప్రాజెక్టు హైడ్రో ఎలక్ట్రిక్ ప్రాజెక్టు, ఆటోమేటిక్ వాటర్ ప్లాంట్స్ సాగు విధానాలు సోలార్ సిస్టం మైక్రోస్కోప్ రక్తనమూనా పరిశీలన హైగ్రాలిక్ లిఫ్ట్ తదితర అద్భుత ఆవిష్కరణ ప్రదర్శించి విద్యార్థులు వారి యొక్క మేథోసంపత్తిని చాటారు. కార్యక్రమంలో భాగంగా సుమారు 200 పైగా నమూనాలను ప్రదర్శించి విద్యార్థులు వారి యొక్క ఆసక్తిని కనబరుస్తూ సర్ సి.వి రామన్ కి గొప్ప నివాళి అర్పించారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు వేడుకలలో భాగంగా సైన్స్ ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

# ఎంట్రప్రెన్యూర్‌షిప్ ద్వారా మహిళల నేతృత్వంలోని అభివృద్ధిని ప్రారంభించడంపై నీతి ఆయోగ్ స్టేట్ వర్క్‌షాప్: మిజోరాంలో అద్భుతమైన విజయం

దాని స్టేట్ సపోర్ట్ మిషన్ కింద, నీతి ఆయోగ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ద్వారా మహిళల నేతృత్వంలోని అభివృద్ధిని ప్రారంభించడంపై మూడవ రాష్ట్ర వర్క్‌షాప్‌ను నిర్వహించింది. ఉమెన్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ప్లాట్‌ఫారమ్ (చిఇఖ) మరియు మిజోరాం ప్రభుత్వ సహకారంతో నిర్వహించబడిన ఈ వర్క్‌షాప్ 27 ఫిబ్రవరి 2025న ఐజ్వాల్‌లోని మిజోరాం విశ్వవిద్యాలయంలో జరిగింది. ఈ కార్యక్రమం ఈశాన్య ప్రాంతంలోని మహిళా పారిశ్రామికవేత్తలకు సాధికారత కల్పించడంపై దృష్టి సారించింది మరియు మొత్తం ఎనిమిది ఈశాన్య రాష్ట్రాల ప్రతినిధులు హాజరయ్యారు.

ముఖ్య అతిథి, మిజోరాం ముఖ్యమంత్రి శ్రీ లల్దుహోమా ప్రారంభ సమావేశంలో మాట్లాడుతూ, "మిజోరంలోని మహిళా పారిశ్రామికవేత్తలు అద్భుతమైన సామర్థ్యాన్ని మరియు స్థితిస్థాపకతను ప్రదర్శించారు, అయినప్పటికీ మూలధనం మరియు మార్కెట్‌లకు ప్రాప్యత వంటి సవాళ్లు కొనసాగుతున్నాయి. మిజోరం బనాకైహ్ హ్యాండ్‌హోల్డింగ్ స్కీమ్ వంటి కార్యక్రమాల ద్వారా, మేము సంక్షేమ-ఆధారిత విధానం నుండి సాధికారత-ఆధారిత మోడల్‌కు మారుతున్నాము-ఇక్కడ వ్యక్తులు కేవలం లబ్ధిదారులు మాత్రమే కాదు, రాష్ట్ర పురోగతికి చురుకైన సహకారులు. మరింత మంది మహిళలు ముందుకు సాగాలని నేను ప్రోత్సహిస్తున్నాను,

ఎందుకంటే వారి ఆవిష్కరణ మరియు సంకల్పం మిజోరాం భవిష్యత్తును నిర్వచిస్తుంది. ఆర్థిక, సామాజిక పరివర్తన దిశగా సాగుతున్న ఈ ప్రయాణంలో ప్రభుత్వం వారికి అండగా నిలుస్తోంది. పాల్గొనేవారు WEP ప్లాట్ ఫారమ్ (www.wep.gov.in)లో నమోదు చేసుకోవాలని మరియు ప్రారంభించిన అన్ని కార్యక్రమాల నుండి ప్రయోజనాలను పొందాలని ఆయన కోరారు.

మిజోరంలో మహిళా ఎంట్రప్రెన్యూర్‌షిప్ ప్లాట్‌ఫాం స్టేట్ చాప్టర్‌ను ప్రారంభించడం మన మహిళా పారిశ్రామికవేత్తలకు సాధికారత కల్పించడంలో ఒక పరివర్తనాత్మక దశను సూచిస్తుందని మిజోరాం ప్రభుత్వ కార్మిక, ఉపాధి నైపుణ్యాభివృద్ధి డ వ్యవస్థాపక శాఖ (ఒఇూఆఇ) మంత్రి శ్రీ లాల్‌గింగ్‌లోవా హ్మార్ అన్నారు. ఈ చొరవ మన మహిళా పారిశ్రామికవేత్తలు దాని నుండి ఆర్థిక భవిష్యత్తును రూపొందించడంలో మహిళా పారిశ్రామికవేత్తల పాత్రను నొక్కి చెప్పారు. ఈశాన్య ప్రాంతంలో మరింత సమగ్రమైన మరియు సహాయక వ్యవస్థాపక పర్యావరణ వ్యవస్థను రూపొందించడానికి స్థానికీకరించే ప్రయత్నాల ప్రాముఖ్యతను ఆయన నొక్కి చెప్పారు. "చిఇఖ మద్దతుతో రాష్ట్ర ప్రభుత్వం యొక్క దార్శనిక కార్యక్రమాలను కలపడం ద్వారా, మేము మహిళా పారిశ్రామికవేత్తలు అభివృద్ధి చెందడానికి, వారి వ్యాపారాలను స్కేల్ చేయడానికి మరియు భారతదేశ ఆర్థిక పరివర్తనకు దోహదపడే స్థిరమైన మరియు సమగ్ర వాతావరణాన్ని సృష్టిస్తున్నాము" అని ఆయన పేర్కొన్నారు.

మిజోరాం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శ్రీ ఖిల్లీ రామ్ మీనా, మహిళా వ్యవస్థాపకతను పెంపొందించడంలో ప్రభుత్వ చొరవలను ఎత్తిచూపారు, ఆర్థిక ప్రాప్యత, నైపుణ్యాభివృద్ధి, డిజిటల్ అక్షరాస్యత మరియు మార్గదర్శకత్వం యొక్క ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు.

# వేములవాడలో ఘనంగా ప్రపంచ టైలర్స్ దినోత్సవం వేడుకలు

-సంబరాలు నిర్వహించుకున్న టైలర్స్ అసోసియేషన్ సభ్యులు

రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 28:(నేటినిజం ప్రతినిధి): ప్రపంచ టైలర్స్ దినోత్సవం సందర్భంగా శుక్రవారం రోజున వేములవాడ పట్టణంలోని లేడీస్ టైలర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి ఘనంగా సంబరలు జరుపుకున్నారు, అనంతరం ఒకరికి ఒకరు స్వీట్స్ తినిపించుకున్నారు,

ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రెసిడెంట్ సింగర్ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రపంచ టైలర్స్ దినోత్సవం సందర్భంగా జిల్లాలోని టైలర్స్ అసోసియేషన్ వారికి శుభాకాంక్షలు తెలియజేశారు, అలాగే టైలర్స్ వారికీ ఈ మధ్యకాలంలో రెడీమేడ్ దుస్తుల వలన చాలామంది వృత్తిని కొనసాగించలేకపోతున్నారని అలాగే పలు షాపింగ్ మాల్స్ యజమాన్యం కూడా కొందరితోని కుమ్మక్కై టైలరింగ్ వారికి అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు, అలాగే వేములవాడలో టైలర్స్ కుట్టుకునే వారు చాలా బీదవారుగా ఉన్నారని వారికి రాబోయే రోజులలో ఇందిరమ్మ ఇండ్లు పెన్షన్స్ ఇప్పించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు, ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు వాసం భూమేష్, క్యాషర్ ఖాజా నహిముద్దీన్ (ఫాషా ) ప్రధాన కార్యదర్శి కోడం సురేష్, ఉపాధ్యక్షురాలు గుడుసెల ఆశ, సంయుక్త కార్యదర్శి అన్నే సంగీత, సహాయ కార్యదర్శి నాగుల సురేష్, ప్రచార కార్యదర్శి శ్రీపతి సతీష్, కార్యవర్గ సభ్యులు గణేష్, మోహన్, భాగ్యశ్రీ, మధుమిత , లహరి, వేముల వజ్రమ్మ తోపాటు యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

# ఖాన్‌తో గేమ్స్ ఆడొద్దు శాల్తీ లేచిపోతుంది.. నిట్లో సందడి చేసిన బ్రహ్మానందం

హనుమకొండ,ఫిబ్రవరి 28: ఖాన్‌తో గేమ్స్ ఆడొద్దు శాల్తీ లేచిపోతుంది.. అంటూ హాస్యనటుడు డాక్టర్ కె.బ్రహ్మానందం విద్యార్థులను ఉత్సాహపరిచారు. వరంగల్ నిట్ స్ప్రింగ్ స్ప్రి 2025 ప్రారంభించి మాట్లాడారు. చాలా పేదరికం నుంచి ఎన్నో అడ్డంకులు, అవహేళనలు ఎదుర్కొని ఈ స్థాయికి వచ్చానన్నారు. లాల్ బహుదూర్ శాస్త్రి, డా. బీఆర్ అంబేద్కర్, అబ్దుల్ కలాం ఎంతో కష్టపడి చదివారని, వారిని స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. లెక్చరర్ గా చేసినప్పటికీ నాకంటూ గుర్తింపు తెచ్చుకోవాలని ఆలోచించగా సినిమాల్లో నటించే అవకాశం రాగా ఒక్కో అడుగు వేస్తూ ఒడిసి పట్టుకున్నానని తెలిపారు.నీ దగ్గర డబ్బు ఉంటేనే నీకు గౌరవం ఇస్తారు. కృషి, పట్టుదల సాధించాలనే తపన ఉంటే ఏదైనా సాధించవచ్చని చెప్పారు. వచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. లైఫ్ ఈజ్ ఏ గేమ్.. విషుడ్ హావ్ టు ప్లే అంటూ విద్యార్థులను ఉత్సాహపరిచారు. 40 ఏళ్ల సినీ పరిశ్రమలో 1200 పైగా చిత్రాల్లో నటించాను. ప్రపంచంలోనే అత్యధికంగా సినిమాలు తీసిన వ్యక్తిగా నిలిచిపోయానని పేర్కొన్నారు. పద్మశ్రీ అవార్డు, డాక్టరేట్, గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో చోటు సంపాదించుకున్నాను. అందరూ బ్రహ్మా 'ఆనందంగా'ఉండాలి, మంచి ఆరోగ్యంతో మంచి ఆలోచనలు వస్తాయని విద్యార్థులలో ఉత్సాహాన్ని నింపారు.

# అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్ విద్యార్థులు జిల్లాస్థాయి ప్రతిభాపాటవ పోటీలలో అత్యుత్తమైన ప్రదర్శన

కరీంనగర్, ఫిబ్రవరి 28: (నేటినిజం ప్రతినిధి) స్థానిక కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో ప్రముఖ దినపత్రిక వారి ఆధ్వర్యంలో నిర్వహించినటువంటి జిల్లా స్థాయి ప్రతిభాపాటవ పోటీలలో పాఠశాలకు చెందినటువంటి అత్యుత్తమ ప్రదర్శనతో పాటు ద్వితీయ బహుమతులు సాధించిన సందర్భంగా ఏర్పాటు చేసినటువంటి ప్రత్యేక అభినందన సభకు ముఖ్య అతిథిగా అల్ఫోర్స్ సంస్థల డాక్టర్ వి.నరేందర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు ప్రాథమిక దశనుండే పలు ప్రతిభాపాటవ పోటీలను నిర్వహించాలని మరియు అందులో పాల్గొనేందుకు ప్రోత్సాహం అందించాలని తద్వారా చాలా అనుభవం పొందుతారని చెప్పారు. ప్రతి విద్యార్థి ప్రాథమిక దశనుండే వివిధ కార్యక్రమాల్లో పాల్గొని మరియు పోటీ పరీక్షలకు హాజరై ప్రాతినిధ్యం వహించి పలు విజయాలను నమోదు చేయాలని కోరారు. నేడు చాలా మంది విద్యార్థులకు పలు అంశాల గురించి అవగాహనలేమితో ఎంతో కోల్పోతున్నారని మరియు విజయాన్ని సునాయాసంగా సాధించలేకపోతున్నారని అభిప్రాయపడుతూ విద్యార్థులకు ప్రతిభాపాటవ పోటీలగురించి తెలియజేయడానికై మరియు అందులో పాల్గొనటానికై పాఠశాల ప్రణాళికల్లో భాగంగా విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహిస్తూ బహుమతులను అందజేయడం జరుగుతుందని చెప్పారు.

ఈ క్రమంలో నేడు జిల్లా కేంద్రంలో నిర్వహించబడిన జిల్లాస్థాయి ఉపన్యాస పోటీలలో శ్రీజన్ రెడ్డి, 9వ తరగతి, ద్వితీయ బహుమతి గెలుపొందాడని మరియు కె. విక్రాంత్, 9వ తరగతి, జిల్లాస్థాయి క్విజ్ పోటీలలో ద్వితీయ బహుమతి గెలుపొందాడని హర్షం వ్యక్తం చేస్తు విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేసి రానున్న రోజులలో మరిన్ని విజయాలు సాధించి సమాజంలో అగ్రగామిగా ఉండాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ బృందం విద్యార్థులు పాల్గొన్నారు.

# చౌటుప్పల్‌లో వారానికోసారి తాగునీటి సరఫరా.. కలెక్టర్‌కు స్థానికుల ఫిర్యాదు..!

నల్గొండ, ఫిబ్రవరి 28:మంచినీటి సరఫరాలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని యాదాద్రి-భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. శుక్రవారం యాదాద్రి-భువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో ఆయన అకస్మికంగా పర్యటించారు. పలు వార్డుల్లో ఇంటింటికి తిరుగుతూ ప్రజలకు ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కుళాయిల ద్వారా సకాలంలో మంచినీటి సరఫరా జరుగుతుందా..? లేదా..? అన్న విషయమై ఆరా తీశారు. తమకు వారానికి ఒక్కసారి మాత్రమే నీటి సరఫరా జరుగుతుందని స్థానికులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. భూగర్భ జలాలు అడుగంటడంతో బోరుబావులన్నీ ఎండిపోయాయని కలెక్టర్‌కు స్థానిక మున్సిపల్ కమిషనర్ కుమార్ రెడ్డి నరసింహారెడ్డి వివరించారు. మిషన్ భగీరథతోపాటు అక్కడక్కడ బోరు బావుల సాయంతో తాగునీరు సరఫరా చేస్తున్నట్లు కుమార్‌రెడ్డి నరసింహారెడ్డి చెప్పారు. వేసవిలో నీటి సమస్యపై సంబంధిత అధికారులు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ హనుమంత రావు సూచించారు.

చౌటుప్పల్‌లోని వంద పడకల దావఖానను కలెక్టర్ హనుమంతరావు సందర్శించారు. దవాఖాన నిర్మాణ పనులు వేగవంతం చేయాలని పేర్కొన్నారు. పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానను ఆకస్మిక తనిఖీ చేశారు. సాధారణ ప్రసవాల సంఖ్య తక్కువగా ఉండడంతో వైద్యులపై అయన సీరియస్ అయ్యారు. వారంలో రెండు రోజులు మాత్రమే సిజేరియన్ ఆపరేషన్లు చేయడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. డాక్టర్లు, సిబ్బంది తీరు మార్చుకోకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. దవాఖాన వద్ద పిర్యాదు బాక్స్ ఏర్పాటు చేసి ప్రతి సోమవారం సమీక్షిస్తామని తెలిపారు.

# భారీ బందోబస్తు మధ్య శ్రీశైలం బ్రహ్మోత్సవాలు విజయవంతం : డీఎస్పీ రామంజి నాయక్

శ్రీశైలం, ఫిబ్రవరి 28: నంద్యాల జిల్లా శ్రీశైలం మహాక్షేత్రంలో జరిగిన మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలకు పకడ్బందీ బందోబస్తు ఏర్పాటు చేయడం వల్ల విజయవంతంగా ముగిసాయని ఆత్మకూర్ డీఎస్పీ రామంజి నాయక్ వెల్లడించారు. శుక్రవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏపీ సీఎం , డీజీపీ, తదితర ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మహా శివరాత్రికి ప్రణాళికబద్ధంగా బందోబస్తు నిర్వహణ చేపట్టామని పేర్కొన్నారు.

రాష్ట్రంలోని పలు సందర్భాల్లో జరిగిన ఘటనలను దృష్టిలో ఉంచుకుని శ్రీశైలం శివరాత్రి బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేశామని తెలిపారు. బందోబస్తులో భాగంగా సుమారు 2,500 మంది పోలీసులు పాల్గొన్నారని వివరించారు. ముఖ్యంగా ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ప్రత్యేక శ్రద్ధ వహించామని తెలిపారు.

అడిషనల్ ఎస్పీ, 13 మంది డీఎస్పీలు , 80 మంది సీఐ లు, 160 మంది ఎస్సైలు, 2, 500 సివిల్ పోలీసులు, 120 మంది ఆర్మ్డ్ పోలీసులు , ఏపీఎస్పీ పోలీసులు, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు పనిచేశాయని తెలిపారు. మున్నెన్నడూ లేనివిధంగా ఈ శివరాత్రి బ్రహ్మోత్సవాలకు 800 సీసీ కెమెరాలతో పర్యవేక్షణ , 8 డ్రోన్లను వాడడం జరిగిందన్నారు. మహా శివరాత్రి వేడుకలను విజయవంతం చేసిన పోలీసు అధికారులకు, సిబ్బందికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ సమావేశంలో సీఐలు ప్రసాద రావు , చంద్రబాబు పాల్గొన్నారు.

# జీఎంఆర్ ఎరీనాలో పవర్ కేబుల్‌చోరీ

హైదరాబాద్, ఫిబ్రవరి 28: 'కంచ చేను మేసిన' చందంగా.. కాపలాగా ఉన్న సెక్యూరిటీ గార్డు కొంతమందితో చేతులు కలిపి పెద్ద ఎత్తున చోరీకి పాల్పడ్డాడు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటన వివరాలు శంషాబాద్ జోన్ డీసీపీ కార్యాలయంలో డీసీపీ రాజేశ్ గురువారం మీడియా సమావేశంలో వెల్లడించారు. హైదరాబాద్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం జీఎంఆర్ ఎరీనాలో బిమార్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ కంపెనీకి సంబంధించిన కాపర్ పవర్ కేబుల్ స్టోరేజీ ఉన్నది. స్టోరేజీలో ప్రధాన నిందితుడు అయిన బాలాపూర్ మండలం మామిడిపల్లి గ్రామంలోని సిగ్నేచర్ వెంచర్ లో నివాసం ఉంటున్న అదిల శ్రీకాంత్ (28) స్టోరేజీ సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు.

అతను ఉప్పుగూడ శివాజీనగర్ కు చెందిన కేతావత్ భాష(32), ముషీరాబాద్ బోలక్ పూర్ కు చెందిన అబ్దుల్ వాహిద్ (44) , బాలాపూర్ మండలం మామిడిపల్లి గ్రామానికి చెందిన మహ్మద్ ఖాదర్ ఖాన్(40) , మహమ్మద్ హుస్సేన్, కుర్సీద్ హుస్సేన్, అలీ అనే ఏడుగురు తో కలిసి ముఠాగా ఏర్పడ్డాడు.

ప్రధాన నిందితుడు శ్రీకాంత్ స్టోరేజ్ కి సంబంధించిన నకిలీ తాళం చెవిని తయారు చేశాడు. ఈ ముఠా సభ్యుల తో కలిసి ఎవరికీ అనుమానం రాకుండా తాళం తెరిచి కాపర్ పవర్ కంట్రోల్ కేబుల్ చోరీ చేశారు. అనంతరం దాన్ని ముక్కలుగా చేసి వివిధ ప్రాంతాలలోని పాత ఇనుప సామగ్రి దుకాణాల్లో అమ్మేశారు. అయితే స్టోరేజీలో నవంబర్ 17 నుంచి 27వ తేదీ మధ్య పవర్ కేబుల్ దొంగతనం జరిగిందని ఆ సంస్థ గుర్తించింది. అంతర్గత రహస్య విచారణ చేపట్టిన సంస్థ యాజమాన్యం సెక్యూరిటీ గార్డు శ్రీకాంత్ కొంతమందితో కలిసి దొంగతనం చేసినట్లుగా నిర్ధారణకు వచ్చారు. ఈనెల 11వ తేదీన సంస్థ ప్రతినిధి అయిన పవన్ కుమార్ కడ్తాల్ శంషాబాద్ ఆర్.జి.ఐ.ఏ పోలీసులకు తమ సంస్థలో దొంగతనం జరిగిందని, దానికి సెక్యూరిటీ గార్డు శ్రీకాంత్ పైనే అనుమానం వ్యక్తం చేస్తూ ఫిర్యాదు చేశారు.

# ట్రంప్‌కు ఎదురుదెబ్బ.. ఉద్యోగుల తొలగింపు నిర్ణయాన్ని నిలిపివేసిన డిస్ట్రిక్ట్ జడ్జ్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 28: రెండోసారి అమెరికా అధ్యక్ష బాధ్యతలు చేపట్టి పాలనలో దూకుడు ప్రదర్శిస్తున్న డొనాల్డ్ ట్రంప్ కు ఎదురుదెబ్బ తగిలింది. ప్రభుత్వ ఉద్యోగుల తొలగింపు విషయంలో ట్రంప్ నిర్ణయానికి డిస్ట్రిక్ట్ జడ్జి విలియం అల్సప్ బ్రేకులు వేశారు. భారీ సంఖ్యలో ఫెడరల్ ఉద్యోగులను తొలగిస్తూ ట్రంప్ తీసుకున్న నిర్ణయాన్ని నిలిపివేశారు. కాగా, అమెరికా ప్రభుత్వ వ్యయాల తగ్గింపు ప్రణాళికల్లో భాగంగా పలు విభాగాల్లో పెద్ద ఎత్తున ఉద్యోగులను ట్రంప్ సర్కార్ తొలగిస్తున్న విషయం తెలిసిందే. ఈ నిర్ణయంపై అన్ని వర్గాల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఈ క్రమంలో అమెరికాలో ఫెడరల్ ఏజెన్సీల్లో ఉద్యోగులను తొలగించాలన్న ప్రభుత్వ చట్టవిరుద్ధమైన ఆదేశాలపై పలు యూనియన్లు, న్యాయవాద సంఘాలు దావా వేశాయి. దీనిపై తాజాగా యూఎస్ డిస్ట్రిక్ట్ కోర్టులో విచారణ జరిగింది. ఈ సందర్భంగా డిస్ట్రిక్ట్ జడ్జి విలియం అల్సప్ తీర్పును వెలువరించారు. అధ్యక్షుడి నిర్ణయాన్ని నిలిపివేస్తూ కీలక ఆదేశాలు జారీ చేశారు. పర్సనల్ మేనేజ్‌మెంట్ కార్యాలయానికి అలాంటి అధికారాలు లేవని న్యాయమూర్తి స్పష్టం చేశారు. తొలగింపు ఉత్తర్వులను తక్షణమే ఉపసంహరించుకోవాలని ఆదేశించారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.
Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: B. Devadas. RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.